# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 176, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 2 సోమవారం -28 - సెప్టెంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana


## నను టచ్ చేస్తే జీవితాంతం బాధపడతారు

- తనను టచ్ చేయవద్దని డీఎంకేకు వారింగ్ ఇచ్చిన విజయ్
- జయలలితను స్టాలిన్ విమర్శించిన వీడియో ఇప్పటికీ వైరల్ అవుతోందన సీఎం
- అప్పుడు జయలలితకు, ఇప్పుడు టీవీకేకి డీఎంకేనే శత్రువు అని వ్యాఖ్య



తమిళనాడులో పోక్సో కేసు వ్యవహారం రాజకీయంగా మరోసారి చర్చకు వచ్చింది. గ్రానైట్ వ్యాపారి వీరమణికి సంబంధించిన పోక్సో కేసును గతంలో అధికారంలో మిగతా 2లో

## 'పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు'.. ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?

- బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు
- విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకే ఈ విజ్ఞప్తి
- పండగల సీజన్‌లో ఈ పిలుపునకు స్పందనపై ఉత్కంఠ
- వినాయక చవితికి 15 శాతం మేర తగ్గిన బంగారం అమ్మకాలు



అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున ధన్‌తేరస్, మిగతా 2లో

## స్థానిక సంస్థల ఎనికలకు బీజేపీ వ్యూహరచన



- కూటమి పార్టీలతో సమన్వయం.. బలమైన అభ్యర్థుల ఎంపికపై కీలక చర్చ
- కదిరి అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశంలో యస్. విష్ణువర్ధన్ రెడ్డి
- రాబోయే స్థానిక సంస్థల ఎనికలకు బీజేపీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు కదిరి అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు.

కదిరి: రాబోయే స్థానిక సంస్థల ఎనికలకు బీజేపీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు మిగతా 2లో

- రాష్ట్రంలో భారీ వర్షాలు, ఉత్తరాంధ్రలో వరద పరిస్థితులపై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్.
- ది ప్రింట్ వ్యవస్థాపకుడు శేఖర్ గుప్తా పోస్టుపై స్పందించిన చంద్రబాబు
- పిక్సెల్స్ నుంచి పైపుల వైపు తన పాలన పయనం సాగిందన సీఎం
- అభివృద్ధి ఫలాలు సామాన్యుడికి చేరాలనదే తన నమ్మకమని వెల్లడి
- సమస్యల పరిష్కారం, జీవనోపాధి కల్పనే ప్రధాన ఉద్దేశమని స్పష్టీకరణ
- దశాబ్దాలుగా ఎదురుచూస్తున చివరి ఆయకట్టు రైతులకు నీరందించడమే లక్ష్యం
- ఏపీలో తీవ్రవాయుగుండం కారణంగా గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి.

### పిక్సెల్స్ అయినా, పైపులైనా..

## లక్ష్యం ఒక్కటే

### 'ది ప్రింట్' కథనంపై సీఎం చంద్రబాబు స్పందన




ఏపీలో తీవ్రవాయుగుండం కారణంగా గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మరో 24గంటల పాటు భారీ వర్షసూచన ఉన్నట్టు వాతావరణశాఖ చెబుతోంది. అయితే భారీ వర్షాలు, మిగతా 2లో

## ఎన్నికల సంఘంపై విశ్వాసం కాపాడాలి



- దేశంలో ప్రజాస్వామ్యం పరివర్తనం చెందాలంటే కేంద్ర ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.
- ఇటీవల ఎన్నికల సంఘం నిర్ణయాలు, ఓటర్ల జాబితాల నిర్వహణపై ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ జాతీయ మీడియాలో వచ్చిన కథనాలు ప్రజల్లో తీవ్ర అనుమానాలను రేకెత్తించాయని పేర్కొంటూ ఆయన ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

దేశంలో ప్రజాస్వామ్యం పరివర్తనం చెందాలంటే కేంద్ర ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉండాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఇటీవల ఎన్నికల మిగతా 2లో

## పోలీసులు భయాన్ని కాదు భరోసా కల్పించాలి



- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత
- క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వంతో విధులు నిర్వహించాలి
- సాంకేతిక పరిజ్ఞానంతో కేసులకు సత్వర పరిష్కారం చూపాలి
- పోలీసుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం
- అధికారంలోకి రాగానే 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ

కడప : "పోలీసు విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, ధైర్యం, మానవత్వం ఎంతో కీలకం. పోలీసు యూనిఫాం ప్రజలకు భరోసా కల్పించేలా పనిచేయాలి. పోలీసు- అంటే భయం కాదు.. ప్రజలకు భరోసా అనే భావన ప్రజల్లో కలిగేలా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలి" అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత నూతన పోలీసు కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు. బాకరాపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ మిగతా 2లో

- కేసీ నుంచి 'ఆర్యదాన్ ముహమ్మద్--2026 ఉత్తమ ప్రజా సేవకుడు' పురస్కారాని స్వీకరిస్తున సీఎం రేవంత్‌రెడ్డి
- దానివల్ల ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పు: సీఎం రేవంత్‌రెడ్డి
- దేశ విభజన యతాలకు తెరదించాలంటే రాహుల్‌ను ప్రధాని చేయాలి
- కేసీ వేణుగోపాల్ నుంచి ఆర్యదాన్ ముహమ్మద్ అవార్డు స్వీకరణ
- దేశాని కులమతాలు, ప్రాంతాలు, భాషల పేరుతో విభజించేందుకు సంఘ్ పరివార్ ప్రయతిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు.
- దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పుగా ఆ సంస్థ పరిణమించిందని దుయ్యబట్టారు.
- ఈ నేపథ్యంలో దేశంలో రెండు పరివార్‌ల మధ్య నేరుగా రాజకీయ పోరాటం కొనసాగుతోందని.. అందులో ఒకటి సంఘ్ పరివార్ అయితే.. రెండోది దేశ ఐక్యత కోసం పనిచేస్తున గాంధీ పరివార్ అని చెప్పారు.
- దేశాని రక్షించాలనా, మన స్వేచ్ఛను కాపాడుకోవాలనా, దేశ విభజన ప్రయతాలకు తెరదించాలనా యావత్ దేశమంతా గాంధీ పరివార్‌కు అండగా నిలవాలని.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి అయ్యేలా చూడాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

### సంఘ్ పరివార్

## దేశాని విభజిస్తోంది

### కేరళం పర్యటనలో ముఖ్యమంత్రి



హైదరాబాద్: దేశాని కులమతాలు, ప్రాంతాలు, భాషల పేరుతో విభజించేందుకు సంఘ్ పరివార్ ప్రయతిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పుగా ఆ సంస్థ పరిణమించిందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో దేశంలో రెండు పరివార్‌ల మధ్య నేరుగా రాజకీయ పోరాటం కొనసాగుతోందని.. అందులో ఒకటి సంఘ్ పరివార్ అయితే.. రెండోది దేశ ఐక్యత కోసం పనిచేస్తున గాంధీ పరివార్ అని చెప్పారు. దేశాని రక్షించాలనా, మన స్వేచ్ఛను కాపాడుకోవాలనా, దేశ విభజన ప్రయతాలకు తెరదించాలనా యావత్ దేశమంతా గాంధీ పరివార్‌కు అండగా నిలవాలని.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి అయ్యేలా చూడాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేరళంకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత మాజీ మంత్రి ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఏర్పాటైన ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ మిగతా 2లో

## హైదరాబాద్ జీపీఓ స్థాయిని తగ్గించొద్దు



- హైదరాబాద్ జీపీఓ హోదా తగ్గింపు ప్రతిపాదనను విరమించుకోవాలని కేంద్రానికి ఒవైసీ లేఖ
- జీపీఓను గ్రూప్ 'ఏ' నుంచి 'బీ'కి మార్చడాని వ్యతిరేకించిన హైదరాబాద్ ఎంపీ
- ఇది వందేళ్ల చారిత్రక సంస్థ అని, పనిభారం అధికమని లేఖలో వెల్లడి
- తెలంగాణలో ఏకైక ఫిలాటెలిక్ బ్యూరో ఇక్కడే ఉందని గుర్తు చేసిన అసద్
- కేంద్ర మంత్రులు పెమ్మసాని, సింధియా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

హైదరాబాద్ నగరానికి చారిత్రక వారసత్వంగా ఉన హైదరాబాద్ జనరల్ పోస్టాఫీస్ (జీపీఓ) హోదాను తగ్గించాలన ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తునట్టు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలకు మిగతా 2లో

### అన్నమయ్య జిల్లాలో హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టు

## రద్దు వెనుక మతలబు ఏంటి ?

### గాల్లో దీపంలా రాష్ట్రంలో ప్రాజెక్టుల పరిస్థితి

- వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి సూటి ప్రశ్న
- తిరుపతిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి
- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సరికొత్త పారిశ్రామిక విధానం
- పగలు ప్రాజెక్టుల ప్రకటనలు, అర్ధరాత్రి రద్దు చేస్తూ జీవోలు



రాష్ట్రంలో ముందుచూపు లేకుండా ప్రాజెక్టులు ప్రకటించడం, ఆ తర్వాత వాటిని మొదలు పెట్టలేక అర్ధరాత్రి జీవోలతో హఠాత్తుగా రద్దు చేయడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. మిగతా 2లో

### ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదు



రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

'ప్యారడైజ్' సినిమాకి పోతునా: కేటీఆర్

రైతుబంధుపై ప్రభుత్వాని తప్పుబట్టిన కేటీఆర్

హామీలు అమలు కాలేదని ఆరోపణ

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తనే దునపోతును తెచ్చుకునారని అనారు. తెలంగాణ భవన్‌లో శనివారం మిగతా 2లో

### ఆధార్ కార్డుతో మద్యంషాపు

## లైసెన్సుకు అప్లై చేసుకోవచ్చు

### మద్యం షాపుల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- ఆధార్ కార్డు ఉన్నవారెవరైనా మద్యం షాపు లైసెన్స్ కోసం అప్లై చేసుకోవచ్చునని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
- శనివారం వైజాగ్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. మద్యం షాపుల డ్రా వివరాలు వెల్లడించారు.
- అక్టోబర్ 5న డ్రా తీసి షాపుల్ని కేటాయిస్తామని పేర్కొన్నారు. కేటాయింపుల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా పర్యవేక్షిస్తున్నామన్నారు.



ఆధార్ కార్డు ఉన్నవారెవరైనా మద్యం షాపు లైసెన్స్ కోసం అప్లై చేసుకోవచ్చునని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం వైజాగ్ లో మీడియాతో మాట్లాడిన ఆయన.. మద్యం షాపుల డ్రా వివరాలు వెల్లడించారు. అక్టోబర్ 5న డ్రా తీసి షాపుల్ని కేటాయిస్తామని పేర్కొన్నారు. మిగతా 2లో

## ఘనంగా కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి

**-జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్**




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): తెలంగాణ ఉద్యమ యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం బి సి వెల్ఫేర్ అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను, ప్రజా సంక్షేమం కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరంలోనూ, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. బాపూజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం, సామాజిక అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, అడిషనల్ డి ఆర్ డి ఎ. సత్తయ్య, స్పోర్ట్స్ అధికారి నర్సింహులు,సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## ఉల్లాస్ - అమ్మకు అక్షరమాల...



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వికారాబాద్ జిల్లాలో "ఉల్లాస్ -- అమ్మకు అక్షరమాల" కార్యక్రమ నిర్వహణలో భాగంగా గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులలో అక్షరాస్యతను పెంపొందించేందుకు పరీక్షను ఆదివారం, 27 సెప్టెంబర్ 2026న జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా మొత్తం 21,607 మంది అభ్యాసకులు రిజిస్టర్ చేసుకోగా, వారిలో 20,870 మంది అభ్యాసకులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో పరీక్షకు హాజరు శాతం సుమారు



96.6%గా నమోదైంది. పరీక్షలు ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జిల్లాలోని 20 మండలాలు, 566 గ్రామ పంచాయతీలు మరియు 4 మున్సిపాలిటీలలో నిర్వహించబడ్డాయి. పరీక్ష నిర్వహణలో డీఆర్డీఏ-- అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి, పరీక్ష కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు, అభ్యాసకుల హాజరు , పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గౌరవ అదనపు నర్సిములు , జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి ఏ పి. శ్రీనివాస బాబు , ప్రాజెక్ట్ అధికారి జిల్లా ఉల్లాస్ కోఆర్డినేటర్ శ్రీ నటరాజ్ జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. అధికారులు పరిగి మండలం రంగాపూర్ గ్రామం, వికారాబాద్ మండలం ఎర్రవల్లి, నవాబుపేట మండలం ఎక్మామిడి గ్రామం, బొంరాస్‌పేట్ మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన పరీక్ష కేంద్రాలను సందర్శించి, పరీక్ష ప్రశాంతంగా సజావుగా జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. "ఉల్లాస్ -- అమ్మకు అక్షరమాల" కార్యక్రమం ద్వారా చదవడం, రాయడం, ప్రాథమిక లెక్కలు వంటి నైపుణ్యాలను అభ్యసిస్తున్న వయోజనులకు ఈ పరీక్ష ఒక ముఖ్యమైన దశగా నిలిచింది. జిల్లాలో అక్షరాస్యతను మరింత విస్తరించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## టీజేఎంయును అధిక మెజార్టీతో గెలిపించండి

**- హనుమంతు ముదిరాజ్**




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కావాలంటే డీజే ఎం యు ను గెలిపించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ తెలిపారు. షాద్నగర్, ఇబ్రహీంపట్నం, హయత్ నగర్ డిపోలలో హనుమంతు ముదిరాజ్ పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలని డిమాండ్ చేసి మేనిఫెస్టోలో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ పెట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం నిరంతరంగా కృషి చేస్తుందని వచ్చే యూనియన్ ఎన్నికల్లో టి జే యం యు కు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమం వంటి అంశాలపై నిరంతరంగా పోరాటాన్ని కొనసాగించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వివిధ యూనియన్లు పరస్పరం అనైతిక పొత్తులు పెట్టుకుంటున్నాయని అన్నారు.

## సీఎం విజయ్ యూటర్న్.. గంటల్లోనే వెనక్కి తగ్గిన సర్కార్!



చెన్నై: సమాచార హక్కు చట్టం పరిధిలోకి శాంతిభద్రతల విభాగాన్ని తీసుకురాకుండా మినహాయింపునిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వులు తీవ్ర దుమారం రేపాయి. ప్రజా సంఘాలు, ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున సీఎం విజయ్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. రాష్ట్రంలోని పబ్లిక్,శాంతిభద్రతల విభాగాన్ని ఆర్టీఐ చట్టం పరిధి నుంచి మినహాయిస్తూ ప్రభుత్వం ముందుగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే పోలీసు కస్టడీ మరణాలు, సామాజిక ఘర్షణలు, నిరసనలు, పోలీసు కాల్పులు వంటి సున్నితమైన అంశాలకు సంబంధించిన రికార్డులను పౌరులు ఆర్టీఐ ద్వారా అడిగి తెలుసుకునే అవకాశం కోల్పోతారు. దీనివల్ల ప్రభుత్వ పాలనలో పారదర్శకత లోపిస్తుందని, ప్రజాస్వామ్య హక్కులకు విఘాతమని రాజకీయ పార్టీలు, హక్కుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రజాగ్రహం,తీవ్ర విమర్శల నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం.. వివాదం ముదరకముందే ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ వివాదానికి తాత్కాలికంగా తెరపడింది.

# ఏఐ రూపం.. భూమికి శాపం

- ఏఐ వీడియోలతో తీవ్ర నీటి కరువు
- 10 సెకన్ల వీడియో తయారీకి 4.1 లీటర్ల నీరు ఆవిరి
- ఏఐ ఇచ్చే సాధారణ టెక్స్ట్ మెసేజ్‌కి 25 ఎంఎల్ నీరు ఖర్చు
- ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు ఏటా వినియోగిస్తున్న నీరు 4.5 ట్రిలియన్ లీటర్లు.. 2027 నాటికి ఇది 6.6 ట్రిలియన్ లీటర్లకు పెరుగుదల
- భారత్‌లో 38 శాతం ఏఐ వినియోగం సరదా కోసమే.. ఏఐ దుర్వినియోగంలో జెన్--జీ యువతే అత్యధికం
- యునైటెడ్ నేషన్స్ వర్సిటీ, కాలిఫోర్నియా వర్సిటీల పరిశోధనలో వెల్లడి
- డిజిటల్ విచక్షణ లేకపోతే ముప్పు తప్పదని హెచ్చరిక



అమరావతి : స్మార్ట్‌ఫోన్ తెరపై ఒక్క క్లిక్.. క్షణాల్లో 80ల నాటి రెట్రో రూపం, సరదాగా మాట్లాడే యానిమేషన్ అవతార్, సోషల్ మీడియా రీల్స్‌లో లైకుల వర్షం కురిపించే చిన్న వీడియో క్లిప్.. నేటి ఆధునిక సమాజం ఈ కృత్రిమ మేధ (ఏఐ) సృష్టిస్తున్న దృశ్య మాయాజాలంలో మైమరచి పోతోంది. అయితే.. వర్చువల్ క్లౌడ్‌లో జరిగే ఈ తేలికపాటి వినోదం వెనుక నేలమీద ఉన్న స్వచ్ఛమైన జలవనరులు నిశ్శబ్దంగా ఆవిరై పోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాహం కేకలు మిన్నంటుతున్న తరుణంలో.. మన చేతివేలి కొన చేసే అనవసర క్లిక్కు సమాజాన్ని నీటి కరువు కష్టాల తీరానికి చేరుస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### కనిపించని డిజిటల్ దాహం..

కృత్రిమమేధ అనేది కేవలం గాల్లో తేలే అల్గారిథమ్ కాదు. దాని మనుగడకు అంతర్జాతీయంగా విస్తరించిన భారీ డేటా సెంటర్లు, లక్షలాది హై--ఎండ్ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూ) నిరంతరం పనిచేయాలి. ఈ సర్వర్లు పనిచేసేటప్పుడు ఉత్పన్నమయ్యే విపరీతమైన వేడిని నియంత్రించడానికి శీతలీకరణ టవర్ల (కూలింగ్ టవర్స్) ద్వారా నీటిని నిరంతరం ప్రవహింపజేస్తారు. ఉష్ణోగ్రతను తగ్గించే క్రమంలో స్వచ్ఛమైన మంచినీరు నేరుగా వాతావరణంలోకి ఆవిరైపోతుంది. డేటా సెంటర్లను 24 గంటలూ నడిపేందుకు అవసరమయ్యే భారీ విద్యుత్ ఉత్పత్తిలో (బొగ్గు ఆధారిత ప్లాంట్లు) అపారమైన నీరు పరోక్షంగా ఖర్చవుతుంది. ప్రత్యక్షంగా డేటా సెంటర్లలోని సర్వర్ల వేడిని తగ్గించడానికి, ఏఐ కోసం అవసరమైన భారీ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే పవర్ ప్లాంట్లలోను, ఏఐ చిప్‌లు, సెమీ కండక్టర్లను తయారుచేసే ప్లాంట్లలోను అత్యంత స్వచ్ఛమైన అల్ట్రా--ప్యూర్ వాటర్ వినియోగిస్తున్నారు.

### ఒక క్లిక్.. ఎంత నీటిని హరిస్తోందంటే..

అంతర్జాతీయ పరిశోధన సంస్థలైన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ (జపాన్) ఏఐ ఆధారిత ఒక్కో డిజిటల్ ప్రక్రియకు ఖర్చయ్యే నీటి లెక్కలను వెల్లడించాయి. మనం నిత్యం జెమినీ, చాట్ జీపీటీలను అడిగే సాధారణ టెక్స్ట్ ప్రశ్నకు దాదాపు 25 మిల్లీలీటర్లు, సగటున 20 ప్రశ్నలకు దాదాపు 500 మిల్లీలీటర్ల (అరలీటరు) నీరు ఖర్చవుతోంది. ఇప్పుడు ట్రెండీగా మారిన 80ల నాటి రెట్రో ఏఐ ఫొటో తయారీకి 30 మిల్లీలీటర్లు అంటే రెండుగుక్కల నీరు ఆవిరవుతోంది. మనకు నచ్చినట్టు పరిపూర్ణమైన ఫొటోకోసం ఒకవ్యక్తి సగటున 10 నుంచి 15 సార్లు రీ--ట్రై చేసినప్పుడు సుమారు లీటరు వరకు ఖర్చవుతుంది. 5 నుంచి 10 సెకన్ల నిడివిగల ఒక్క ఏఐ వీడియో కోసం దాదాపు 4.1 లీటర్ల నీరు ఆవిరవుతోంది. వీడియోల్లో ప్రతి ఫ్రేమ్‌ను క్లిష్టమైన డిఫ్యూజన్ మోడళ్ల ద్వారా రెండర్ చేయాల్సిరావడమే ఇందుకు కారణంగా నిపుణులు చెబుతున్నారు.




### మనదేశంలో సంక్షోభ తీవ్రత..

మనదేశం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం మాత్రమే కాదు.. అత్యంత తీవ్రమైన జలసంక్షోభాన్ని ఎదుర్కొంటున్న దేశాల్లో ఒకటిగా మారబోతున్నట్టు యూఎన్‌వో ఆందోళన వ్యక్తంచేస్తోంది. నీతి ఆయోగ్ కాంపోజిట్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇండెక్స్ ప్రకారం.. దేశంలో దాదాపు 60 కోట్లమంది ప్రజలు తీవ్రమైన నీటికొరతను ఎదుర్కొంటున్నారు. ప్రపంచంలో వెలికితీసే మొత్తం భూగర్భ జలాల్లో 25 శాతం మన దేశంలోనే జరుగుతోంది. మరోపక్క భారత్ డేటా సెంటర్ల హబ్‌గా మారుతోంది. ముంబై, చెన్నై, హైదరాబాద్, నోయిడా, విశాఖపట్నం వంటి నగరాలు డేటా సెంటర్ల కేంద్రాలుగా శరవేగంగా మారుతున్నాయి. ఇప్పటికే తాగునీటి కోసం వేసవిలో ట్యాంకర్లపై ఆధారపడే ఈ మెట్రో నగరాల్లో భారీ సర్వర్ల నిర్వహణ స్థానిక ప్రజల తాగునీటిపై తీవ్రమైన ఒత్తిడి తెస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ మితిమీరిన పోకడ నియంత్రణ లేకుండా కొనసాగితే రాబోయే కాలంలో మానవాళికి కష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

### ముందున్నది గడ్డు కాలం..

' 2022 చివర్లో జనరేటివ్ ఏఐ విస్తరణ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఏఐ డేటా సెంటర్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కోట్ల (ట్రిలియన్) లీటర్ల నీటిని వినియోగించాయి. ' యూఎన్ యూనివర్సిటీ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్లు ఏడాదికి దాదాపు 4.5 ట్రిలియన్ లీటర్ల నీటిని వినియోగిస్తున్నాయి. ఇందులో ఏఐ వాటా దాదాపు 20 శాతం (750 బిలియన్ లీటర్ల నుంచి 900 బిలియన్ లీటర్లు). ' నాలుగేళ్లుగా ఏఐ ట్రైనింగ్, ప్రాసెసింగ్, చిప్ తయారీకి 3 ట్రిలియన్ లీటర్లకు పైగా నీటిని వినియోగించారు. ' వాటర్ రీసెర్చ్ అధ్యయనం ప్రకారం.. ఏఐ వినియోగం ఇలాగే పెరిగితే 2027 నాటికి ఏటా 6.6 ట్రిలియన్ లీటర్లకు చేరుకోవచ్చని అంచనా. ఇది డెన్మార్క్ లేదా యూకే వంటి దేశాల వార్షిక గృహావసర నీటి వినియోగంతో సమానం.

### అంతర్జాతీయంగా జల సంక్షోభం..

ఈ వినోద వినియోగం ప్రపంచంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులతో పోల్చినప్పుడు తీవ్రమైన పర్యావరణ అసమానతలను బయటపెడుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 220 కోట్ల మందికి పైగా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందుబాటులో లేదు. మరో 350 కోట్ల మంది కనీసం సంవత్సరంలో ఒక నెలపాటు తీవ్రమైన నీటి ఎద్దడిని అనుభవిస్తున్నారు. చవకైన భూమి, పన్ను మినహాయింపులు, అనుకూల వాతావరణం పేరుతో బహుళజాతి టెక్ సంస్థలు తీవ్ర నీటికొరత ఉన్న ప్రాంతాల్లోనే డేటా సెంటర్లను నిర్మిస్తున్నాయి. అమెరికాలోని అయోవా, అరిజోనా వంటి ప్రాంతాల్లో స్థానిక మున్సిపాలిటీల తాగునీటి సరఫరాలో 20 శాతం వరకు ఈ సర్వర్లే లాగేసుకుంటున్నాయి. నీటివనరులు కలుషితమై లేదా అడుగంటిపోవడంవల్ల ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల నుంచి లక్షలాదిమంది ప్రజలు వలసబాట పడుతుండగా, మరోవైపు విలాసవంతమైన డిజిటల్ వినోదం కోసం రోజూ కోట్లాది లీటర్ల నీటిని ఆవిరి చేసేస్తున్నారు.

### భారత్‌లో 60% ఏఐ రీల్స్ కోసమే..

భారతదేశంలో నిత్యం 7 నుంచి 10 కోట్లమంది క్రియాశీల ఏఐ వినియోగదారులు ఉన్నారు. సేల్స్‌ఫోర్స్, ప్యూ రీసెర్చ్, కౌంటర్ సంస్థ గ్లోబల్ సర్వే, అధ్యయనం ప్రకారం భారతదేశంలో చాట్‌జీపీటీ, మిడ్‌జర్నీ, లెన్సా, పర్‌చాన్స్ వంటివి ఉపయోగించే మొత్తం క్రియాశీల భారతీయుల్లో దాదాపు 3.5 కోట్లమంది (38 శాతం) కేవలం కాలక్షేపం, సరదా, వినోదం కోసమే వాడుతున్నారు. వైరల్ ట్రెండ్స్ నడిచే సమయాల్లో (ఉదా.. మెట్రో ఘిబ్లర్లు, యానిమేట్ అవతార్లు వచ్చినప్పుడు) ఈ సంఖ్య 5 కోట్లు దాటుతోంది. సోషల్ మీడియాలో వైరల్ ట్రెండ్‌లు నడిచే రోజుల్లో ఈ అనవసర వినియోగదారుల సంఖ్య అంతకుమించుతోంది. జెన్--జీ (వయసు 16--24) యువతలో 60% మంది రీల్స్, ఫేస్--స్వాప్, మీమ్స్ కోసమే గంటల తరబడి సర్వర్లను రీ--జనరేట్ చేస్తూ నీటిని కరిగిస్తున్నారు.

# బంతి అమెరికా కోర్టులో.. ఇరాన్ నెక్స్ట్ మూవ్ ఏంటి?




ఇరాన్--అమెరికా యుద్ధానికి తెరపడుతుందన్న ఆశలు మళ్లీ ఆవిరవుతున్నాయా? హర్మూజ్ జలసంధిని ఏడు రోజుల్లో తెరిచి.. యుద్ధాన్ని నిలిపివేసేందుకు ఇరాన్ ప్రతిపాదించిన ప్లాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించాడనే కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఇదే నిజమైతే.. ఇప్పుడు ఇరాన్ తదుపరి అడుగు ఏంటి? హర్మూజ్ పరిస్థితి ఎలా మారుతుంది? యుద్ధం మళ్లీ తీవ్ర రూపం దాల్చుతుందా?.. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ వేదికగా ఇరాన్ తన ప్రతిపాదనను అమెరికా ముందుంచింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో ఈ ప్రతిపాదనను వాషింగ్టన్‌కు పంపినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తెలిపారు. అమెరికా అంగీకరిస్తే ఏడు రోజుల కౌంట్‌డౌన్ మొదలై.. హర్మూజ్ జలసంధిలో సాధారణ నౌకాయానం పునరుద్ధరించవచ్చని చెప్పారు. అదే సమయంలో ప్రాంతీయంగా అన్ని రంగాల్లో పోరాటాన్ని నిలిపివేసి విస్తృత చర్చలకు వెళ్లొచ్చని ప్రతిపాదించారు. అయితే ఇందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ పోర్టులపై దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఇరాన్ నిధులను విడుదల చేయాలని, చమురు ఆంక్షలను తొలగించాలని ఇరాన్ కోరుతోంది. అణు కార్యక్రమంపై మాత్రం తమ హక్కుల్లో ఎలాంటి రాయితీ ఇవ్వబోమని ఇరాన్ వర్గాలు స్పష్టం చేశాయి. ముఖ్యంగా యురేనియం శుద్ధి విషయంలో రాజీ ఉండదని తెలిపాయి.

### ట్రంప్ తిరస్కరిస్తే.. తర్వాత?

'వాల్‌స్ట్రీట్ జర్నల్' కథనం ప్రకారం.. ఇరాన్ తన డిమాండ్లను అంగీకరిస్తుందన్న నమ్మకం ట్రంప్‌కు లేదని, తిరిగి బాంబుల దాడి చేసే అవకాశం ఉందని ఆయన తన సిబ్బందితో చెప్పినట్లు అమెరికా అధికారులు పేర్కొన్నారు. మరో నివేదిక ప్రకారం.. నవంబర్‌లో జరిగే అమెరికా మధ్యంతర ఎన్నికల తర్వాత బాంబుల దాడులు మళ్లీ ప్రారంభమయ్యే అవకాశాన్ని ట్రంప్ అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. గతంలోనూ చర్చల ప్రయత్నాలు విఫలమై.. కొంతకాలం కాల్పుల విరమణ తర్వాత మళ్లీ దాడులు జరిగిన నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

### హర్మూజ్ సంగతేంటి?

ఇరాన్ ప్రతిపాదనలో కీలక అంశం హర్మూజ్ జలసంధి. ప్రపంచంలోని అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గాల్లో ఒకటైన ఈ జలసంధి ద్వారా రవాణా తీవ్రంగా దెబ్బతినడంతో ఇప్పటికే ప్రపంచ ఇంధన సరఫరాపై ప్రభావం పడింది. అమెరికా--ఇరాన్ మధ్య ఒప్పందం కుదరకపోతే హర్మూజ్ పరిస్థితి మరింత కాలం అనిశ్చితంగానే కొనసాగే అవకాశం ఉంది. ఇరాన్ మాత్రం అమెరికా తమపై సైనిక ఒత్తిడి తగ్గించి, పోర్టుల దిగ్బంధాన్ని ఎత్తివేస్తే ఏడు రోజుల్లో జలసంధిని తిరిగి తెరవడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతోంది. అంటే ఇప్పుడు బంతి అమెరికా కోర్టులోనే ఉందన్నది ఇరాన్ వాదన.

### ఇరాన్ ముందున్న దారులేంటి?

అమెరికా తన ప్రతిపాదనను అంగీకరించకపోతే ఇరాన్ ముందున్న మార్గాలు ప్రధానంగా మూడు. మొదటిది.. దౌత్య మార్గాన్ని కొనసాగిస్తూ ఖతార్, ఒమన్ వంటి మధ్యవర్తుల ద్వారా చర్చలను ముందుకు తీసుకెళ్లడం. రెండోది.. హర్మూజ్ జలసంధిపై తన నియంత్రణను కొనసాగిస్తూ అమెరికాపై ఒత్తిడి పెంచడం. అయితే ఇది ప్రపంచ ఇంధన సరఫరాపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ఇరాన్‌కూ ఆర్థిక, దౌత్యపరమైన ఒత్తిళ్లు పెరగొచ్చు. మూడోది.. అమెరికా సైనిక చర్యలకు ప్రతిస్పందిస్తూ ప్రాంతీయంగా తన మిత్ర బలగాల ద్వారా ఒత్తిడి పెంచడం. కానీ ఈ మార్గం యుద్ధం మరింత విస్తరించే ప్రమాదాన్ని పెంచుతుంది. మరోవైపు ఏడు రోజుల ప్రతిపాదనను ముందుకు తెచ్చిన ఇరాన్.. హర్మూజ్‌ను తిరిగి తెరవడం, కాల్పుల విరమణ, తదుపరి అణు చర్చలను ఒకే ప్యాకేజీగా మలచాలని చూస్తున్నట్లు కనిపిస్తోంది. అందువల్ల అమెరికా స్పందన ఆధారంగా ఈ మూడు మార్గాల్లో ఏది ముందుకు వస్తుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

### మరోవైపు సౌదీపై హౌతీల దాడులు

ఇదిలా ఉండగా.. ఇరాన్ మద్దతుగల యెమెన్ హౌతీలు సౌదీ అరేబియాపై దాడులు కొనసాగిస్తున్నారు. రియాద్ వైపు వచ్చిన రెండు డ్రోన్లను, ఖమీస్ ముషైత్ వైపు ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకున్నట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణం తెలిపింది. ఈ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో సౌదీ అరేబియా భద్రతకు మద్దతుగా పాకిస్థాన్, టర్కీ రక్షణాధికారులు రియాద్‌లో సమావేశమై భద్రతా పరిస్థితిపై చర్చించారు. ఇరాన్ ప్రతిపాదనకు అమెరికా స్పందన ఎలా ఉండబోతోంది? ట్రంప్ వైఖరి నేపథ్యంలో హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటుందా? లేదంటే పశ్చిమాసియాలో పోరాటం మళ్లీ ముదురుతుందా? అన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. ఇరాన్ ఏడు రోజుల గడువుతో శాంతి ప్రతిపాదనను ముందుకు తెచ్చిన నేపథ్యంలో.. తదుపరి నిర్ణయం అమెరికా చేతుల్లోనే ఉందనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

## పీజీఆర్ఎస్‌పై క్యూ.ఆర్. కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

### ప్రజల అభిప్రాయాలతో సేవల్లో మరింత పారదర్శకత
### జిల్లా, మండల స్థాయి కేంద్రాల్లో క్యూ.ఆర్. కోడ్‌ల ఏర్పాటు
### అర్జీల స్థితిగతుల కోసం 1100కు ఫోన్ చేయవచ్చు
### జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్




అనంతపురం, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదికపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూ.ఆర్. కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించడంతో పాటు ప్రజల సంతృప్తిని మెరుగుపరిచేందుకు నిరంతరం అభిప్రాయాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లా, మండల స్థాయిల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కేంద్రాల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు క్యూ.ఆర్. కోడ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. జిల్లా, మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో క్యూ.ఆర్. కోడ్‌లను స్పష్టంగా కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నోటీసు బోర్డులు, సహాయ కేంద్రాలు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద కూడా క్యూ.ఆర్. కోడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూ.ఆర్. కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే స్పందన అధికారిక ప్రజా సమస్యల పరిష్కార వేదిక పోర్టల్‌కు చేరుతుందని పేర్కొన్నారు. అర్జీల స్థితిగతులను తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ అర్జీలను సమర్పించాలని, అనంతరం క్యూ.ఆర్. కోడ్ ద్వారా తమ స్పందనను తెలియజేయాలని కోరారు. ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక సేవలను సద్వినియోగం చేసుకుని తమ అభిప్రాయాలను తెలియజేయడం ద్వారా మరింత మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌కు ఘన స్వాగతం

### అనంతపురం జిల్లా పర్యటనకు జి.సి. కిషోర్ కుమార్
### ఆర్డీటీ అతిథి గృహంలో కలెక్టర్ ఓ. ఆనంద్ స్వాగతం



అనంతపురం, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): అనంతపురం జిల్లా ఎన్నికల జాబితా పరిశీలకుడు, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ కృష్ణా-గోదావరి కాలువల మిషన్ నిర్వహణ సంచాలకుడు జి.సి. కిషోర్ కుమార్ ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా నగరంలోని ఆర్డీటీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ ఆయనను కలిశారు. పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు.

## క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

### అనంతపురం రూరల్‌లో పలు ప్రాంతాల్లో పర్యటించిన ఎన్నికల జాబితా పరిశీలకుడు
### క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై అధికారులను అడిగి తెలుసుకున్న జి.సి. కిషోర్ కుమార్
### బీఎల్ఓలకు పలు సూచనలు చేసిన పరిశీలకుడు, కలెక్టర్



అనంతపురం, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): అనంతపురం జిల్లా ఎన్నికల జాబితా పరిశీలకుడు, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ కృష్ణా-గోదావరి కాలువల మిషన్ నిర్వహణ సంచాలకుడు జి.సి. కిషోర్ కుమార్ ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక సమగ్ర సవరణ--2026 ప్రక్రియను పరిశీలించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్‌తో కలిసి అనంతపురం రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ఏ. నారాయణపురం--2 స్వర్ణ గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆయన.. అక్కడ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న పనులపై గ్రామ రెవెన్యూ అధికారి, బూత్ స్థాయి అధికారిని అడిగి తెలుసుకున్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, ఫారం--6, ఫారం--7, ఫారం--8కు సంబంధించిన వివరాలను వారు పరిశీలకుడికి వివరించారు. ప్రత్యేక సమగ్ర సవరణపై బూత్ స్థాయి అధికారి మంచి అవగాహనతో పనిచేస్తున్నారని అభినందించిన జి.సి. కిషోర్ కుమార్, ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇదే విధంగా పనిచేయాలని సూచించారు.



అనంతరం విద్యారణ్యనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పలు పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ స్థాయి అధికారులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బూత్ స్థాయి అధికారుల యాప్‌తో పాటు ఇతర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.




తదుపరి పాపంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి 75 నుంచి 86 వరకు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బూత్ స్థాయి అధికారులు అడిగిన సందేహాలను నివృత్తి చేసి, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని పరిశీలకుడు, జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రేమంత కుమార్, ఎన్నికల నమోదు అధికారి వెంకటనారాయణ, తహసీల్దార్ రాజా, సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఎంపీడీఓ దివాకర్, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువత భవితకు నైపుణ్యమే భరోసా

### నర్సింగ్ రంగంలో విస్తృత అవకాశాలు: ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ
### నర్సింగ్ విద్యతో దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు
### విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
### మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి
### తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి



అనంతపురం, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): అనంతపురం నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న శ్రీ సాయి కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో ఆదివారం నిర్వహించిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమానికి అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. నర్సింగ్‌లో డిప్లొమా, డిగ్రీ విద్యను అభ్యసించిన వారికి సేవా రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని ఎంపీ తెలిపారు. నర్సింగ్ వృత్తిలో నైపుణ్యాలను పెంపొందించుకుని పట్టణాలు, నగరాలతో పాటు ఇతర దేశాల్లోనూ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఆసుపత్రుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో నర్సింగ్ సిబ్బందికి అవకాశాలు మరింత విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. సేవా రంగంలో మదర్ థెరిసా అందించిన సేవలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని గుర్తుచేశారు. విద్యార్థులు కష్టపడి చదివి, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. యువత చిన్న వయసులోనే మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాలికలు మహిళల భద్రత, రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచుకోవాలని, అందుబాటులో ఉన్న భద్రతా సదుపాయాలు, అనువర్తనాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, స్త్రీ వైద్య నిపుణురాలు బాలకుమారి, ప్రిన్సిపాల్ అమృత, పరిపాలన అధికారి రామకృష్ణ, నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోండి

### ఈనెల 28న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్
### ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం
### ఫిర్యాదుల స్థితిగతులు తెలుసుకునేందుకు 1100కు కాల్ చేయవచ్చు
### జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
### జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



అనంతపురం, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. గతంలో దాఖలు చేసిన అర్జీలు ఇంకా పరిష్కారం కాకపోయినా, వాటి స్థితిగతులపై సమాచారం తెలుసుకోవాలన్నా 1100కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ప్రజలు తమ అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాల్లో 'మీకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100' అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

#### 28న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఈనెల 28న సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చిన వారు సంబంధిత రసీదు లేదా అర్జీ స్లిప్పును తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. సమస్య పరిష్కారమైన అనంతరం అర్జీదారుల ఫోన్‌కు సందేశం వస్తుందని, తమ ఫోన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. నోటీసులు, పరిష్కార వివరాలను వాట్సాప్ ద్వారా పంపిస్తామని, అవసరమైన వివరాలను రిజిస్టర్ పోస్టు ద్వారా అర్జీదారు ఇచ్చిన చిరునామాకు పంపిస్తామని తెలిపారు. అర్జీ సమర్పించే సమయంలో వివరాలను సరిగ్గా నమోదు చేయాలని, పదేపదే అర్జీలు సమర్పించే వారు గతంలో ఇచ్చిన అర్జీ రసీదును వెంట తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం పూర్తయ్యే వరకు డివిజన్, మండల, సచివాలయ స్థాయిల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాలను నిర్వహించాలని ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు.

## క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై సూపర్ చెక్

### 181 క్లెయిమ్‌లను పరిశీలించిన జిల్లా ఎన్నికల జాబితా పరిశీలకుడు
### 97 చేర్పులు, 75 మార్పులు, 9 తొలగింపు దరఖాస్తుల పరిశీలన
### అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయాలి
### అనర్హులకు ఓటరు జాబితాలో చోటు కల్పించొద్దు



అనంతపురం, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై సూపర్ చెక్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల జాబితా పరిశీలకుడు, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ కృష్ణా-గోదావరి కాలువల మిషన్ నిర్వహణ సంచాలకుడు జి.సి. కిషోర్ కుమార్, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్‌తో కలిసి ఎన్నికల నమోదు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎన్నికల జాబితా పరిశీలకుడి పరిశీలనకు వచ్చిన మొత్తం 181 సూపర్ చెక్ క్లెయిమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. వీటిలో ఓటర్ల చేర్పులకు సంబంధించిన 97, వివరాల మార్పులకు సంబంధించిన 75, ఓటర్ల తొలగింపులకు సంబంధించిన 9 దరఖాస్తులు ఉన్నాయి. వీటన్నింటినీ పరిశీలించిన అనంతరం ఎన్నికల నమోదు అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా చేపట్టిన చర్యలకు సంబంధించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల రికార్డులను ఎన్నికల నమోదు అధికారుల వారీగా యాదృచ్ఛికంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో ఒకేసారి ఫారం--6, ఫారం--7, ఫారం--8 దరఖాస్తులు నమోదు కాకుండా నిబంధనల మేరకు పరిశీలించాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరును జాబితాలో నమోదు కాకుండా వదిలిపెట్టరాదని, అనర్హులకు ఓటరు జాబితాలో చోటు కల్పించరాదని స్పష్టం చేశారు. ఓటరుగా అర్హతను నిర్ధారించేందుకు సమర్పించాల్సిన పత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పంచనామా, వివరణాత్మక ఉత్తర్వుల ప్రక్రియను నిబంధనల మేరకు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సమర్థంగా నిర్వహిస్తున్నందుకు జిల్లా కలెక్టర్‌ను జిల్లా ఎన్నికల జాబితా పరిశీలకుడు అభినందించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సంబంధించి చేపడుతున్న చర్యల వివరాలను జిల్లా ఎన్నికల జాబితా పరిశీలకుడికి వివరించారు.



ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ ప్రేమంతకుమార్, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, ఎస్‌డీసీలు రామ్మోహన్, రమేష్ రెడ్డి, వెంకట నారాయణ, రవిశంకర్ రెడ్డి, కిరణ్మయి, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, ఎన్నికల డీటీలు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కులు ప్రతి ఒక్కరికీ అందాలి

### తాడిపత్రి, గుత్తిలో నూతన న్యాయస్థానాల ప్రారంభం
### వర్చువల్‌గా ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్
### న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి
### న్యాయమూర్తులు, న్యాయవాదుల సమన్వయంతో సత్వర న్యాయం



తాడిపత్రి, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కులు, న్యాయపరమైన రక్షణ అందరికీ సమానంగా అందేలా చూడాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థతో పాటు న్యాయవాదులు, కార్యనిర్వాహక వ్యవస్థ, ప్రతి పౌరుడిపై ఉందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్ తెలిపారు. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, గుత్తిలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యాయస్థానాలను ఆదివారం ఆమె వర్చువల్ విధానంలో ప్రారంభించారు. తాడిపత్రిలో జరిగిన కార్యక్రమానికి జిల్లా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్. భానుమతి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. సురేష్ రెడ్డి, జస్టిస్ చల్లా గుణరంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ లిసాగిల్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని వివిధ అధికరణాల ద్వారా ప్రజలకు కల్పించిన హక్కులు, న్యాయ రక్షణపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, న్యాయస్థానాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి చేయాలని అన్నారు. అనంతపురం జిల్లాలో ఇతర జిల్లాలతో పోలిస్తే 17 నూతన అదనపు న్యాయస్థానాలు మంజూరైన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. తాడిపత్రిలో సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం, జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం, మొదటి అదనపు న్యాయ మేజిస్ట్రేట్ న్యాయస్థానం, గుత్తిలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. న్యాయవాదులు న్యాయస్థానాల తీర్పులను విస్తృత దృక్పథంతో అర్థం చేసుకోవాలని సూచించారు. న్యాయవృత్తిలో అనుభవం, నిరంతర అధ్యయనం, ఆత్మపరిశీలన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని సూచించారు. నూతన న్యాయస్థానాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.




#### ప్రజలకు న్యాయవ్యవస్థను మరింత చేరువ చేయాలి

ప్రజలకు న్యాయవ్యవస్థను మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు న్యాయమూర్తి, అనంతపురం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్. భానుమతి అన్నారు. న్యాయవ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడానికి న్యాయవాదులు, న్యాయమూర్తుల మధ్య సమన్వయం కీలకమని తెలిపారు. ప్రతి న్యాయవాది న్యాయస్థానానికి సహకరించే బాధ్యత కలిగిన వ్యక్తిగా వ్యవహరిస్తూ, చట్టపరమైన అంశాలను సమగ్రంగా కోర్టు దృష్టికి తీసుకురావాలని సూచించారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించి, కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా కొత్త జిల్లాలకు అవసరమైన న్యాయస్థానాలు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కోర్టు భవనాలు, సిబ్బంది, సాంకేతిక సదుపాయాలు, ఇతర మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా పెరుగుతున్న న్యాయపరమైన పనిభారాన్ని సమర్థవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. సురేష్ రెడ్డి, జస్టిస్ చల్లా గుణరంజన్ మాట్లాడుతూ.. న్యాయస్థానాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాలు, ఆశ్రయ గృహాల్లోని పిల్లలు, ఇతర అవసరమైన వారికి చట్టపరమైన రక్షణ, సంక్షేమ సేవలు అందేలా న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతన న్యాయస్థానాల ఏర్పాటు, అభివృద్ధికి జిల్లా యంత్రాంగం, న్యాయశాఖ అధికారులు, సంబంధిత విభాగాల మధ్య సమన్వయం అవసరమని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు మాట్లాడుతూ.. నూతన న్యాయస్థానాలు ప్రజలకు సత్వర, సమర్థవంతమైన న్యాయం అందించే కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, అధికారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్, అనంతపురం ఏడీజే జడ్జి సత్యవాణి, గుత్తి అదనపు జిల్లా జడ్జి శంకర్రావు, గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ ఆచారి, అనంతపురం ఎక్సైజ్ కోర్టు జడ్జి పావని, తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి అనిల్ కుమార్ నాయక్, తాడిపత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.వి. రమణారెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## గుత్తిలో నూతన న్యాయస్థానం ప్రారంభం

### డిజిటల్ విధానంలో న్యాయస్థానాన్ని ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
### న్యాయ సేవలను మరింత వేగవంతం చేయడమే లక్ష్యం
### కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా చర్యలు
### న్యాయస్థాన ప్రాంగణంలో మొక్కలు నాటిన న్యాయమూర్తులు

గుత్తి, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): అనంతపురం జిల్లా పరిధిలోని గుత్తి పట్టణంలో 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయస్థానం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లలితా కౌశిక్ చేతుల మీదుగా నూతన న్యాయస్థానాన్ని డిజిటల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, అనంతపురం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ బి.ఎస్. భానుమతి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. సురేష్ రెడ్డి, జస్టిస్ గుణరంజన్ తదితరులు హాజరయ్యారు. అలాగే అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు, 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. శంకరరావు, సీనియర్ సివిల్ జడ్జి ఎం. కాశీ విశ్వనాథ ఆచారి, జెఎఫ్ఎంసీ శ్వేత, గుత్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికారు. జస్టిస్ బి.ఎస్. భానుమతి మాట్లాడుతూ నూతన న్యాయస్థానం ప్రారంభంతో గుత్తి ప్రాంత ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. న్యాయ పరిపాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేసులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి, న్యాయ సేవలను వేగవంతం చేయడమే న్యాయస్థానాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కదిరి ప్రాంతంలో నూతనంగా నిర్మించిన రెండో, మూడో అదనపు మెజిస్ట్రేట్ న్యాయస్థానాల భవనాలను కూడా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వర్చువల్ విధానంలో ప్రారంభించినట్లు వివరించారు.





హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె. సురేష్ రెడ్డి, జస్టిస్ గుణరంజన్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా కదిరి, గుత్తి, తాడిపత్రి ప్రాంతాల్లో నూతన న్యాయస్థానాలను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో కొత్తగా 17 అదనపు న్యాయస్థానాలు మంజూరయ్యాయని, అందులో భాగంగానే గుత్తిలో నూతన కోర్టును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కక్షిదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేసులు సత్వరమే పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించడంతో పాటు ప్రజలకు వేగవంతమైన న్యాయ సేవలు అందించాలనే ఉద్దేశంతో అదనపు న్యాయస్థానాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం కోర్టు ప్రాంగణంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథులు పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/26/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
ఉమ్మడి గుంటూరు జిల్లా
సోమవారం - 28 - సెప్టెంబర్ - 2026

# వెంకటేశ్వర్లు కుటుంబానికి పిన్నెల్లి ఆర్థిక భరోసా





కారంపూడి సెప్టెంబర్ 27:(మహి న్యూస్): కారంపూడి మండలంలోని నరమాలపాడు గ్రామానికి చెందిన బుస్సా వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైయస్ఆర్‌సీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చుతూ, "ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలి. మీ కుటుంబానికి అండగా ఉంటాం. ఏ అవసరం వచ్చినా తమను సంప్రదించండి. సాధ్యమైనంత మేరకు సహాయ సహకారాలు అందిస్తాం" అని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# పీజీఆర్ఎస్ పక్కాగా నిర్వహించాలి

### పీజీఆర్ఎస్ టోల్‌ఫ్రీ నంబర్ 1100

### 1100కు ఫోన్ చేసి అర్జీల వివరాలు తెలుసుకోవచ్చు

### క్యూ.ఆర్. కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చు

### జిల్లా, మండల స్థాయిలో కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ

గుంటూరు, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం జిల్లా, మండల స్థాయిలోని అన్ని కార్యాలయాల్లో పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నేరుగా సమర్పించవచ్చని తెలిపారు. అలాగే మీ కోసం వెబ్‌సైట్ ద్వారా కూడా అర్జీలను నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి గతంలో సమర్పించిన అర్జీల వివరాలు, వాటి పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కేంద్రాల్లో ఏర్పాటు చేసిన క్యూ.ఆర్. కోడ్‌ను స్కాన్ చేసి తమ స్పందనను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

# రాయవరం అడ్డరోడ్డులో విద్యార్థులు, ప్రయాణికుల అవస్థలు

### బస్‌షెల్టర్ లేక ఎండా.. వానా.. రోడ్డుపైనే నిరీక్షణ



రాయవరం, సెప్టెంబర్ 27:(మహి న్యూస్): మాచర్ల మండలం,రాయవరం అడ్డరోడ్డు వద్ద విద్యార్థులు, ప్రయాణికులకు కనీస బస్ నిరీక్షణ సదుపాయం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, నరసరావుపేట వైపు ప్రయాణించే ప్రజలు బస్సుల కోసం రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ప్రయాణికులు, విద్యార్థులు ఎండ, వర్షం నుంచి రక్షణ పొందేందుకు ఉన్న బస్‌షెల్టర్ ప్రస్తుతం లేకపోవడంతో ఇబ్బందులు మరింత పెరిగాయి. ఎండలో నిలబడాల్సి రావడంతో పాటు వర్షం కురిసిన సమయంలో తలదాచుకునేందుకు కూడా సరైన వసతి లేక అవస్థలు పడుతున్నారు. కూర్చునేందుకు సదుపాయం లేక వృద్ధులు, మహిళలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. రాయవరం అడ్డరోడ్డు నుంచి దుర్గి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, నరసరావుపేట వైపు ప్రయాణించే ప్రజలు ప్రతిరోజూ ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. కొన్ని సమయాల్లో బస్సులు సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు మరింత ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యార్థులు, ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాయవరం అడ్డరోడ్డులో బస్‌షెల్టర్‌ను పునరుద్ధరించడంతో పాటు బస్సుల రాకపోకలు సక్రమంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# అక్టోబర్ 1 మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ

### జాతీయ బ్యాంకు ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో మార్పు

### అక్టోబర్ 1న ఉదయం నగదు తీసుకుని మధ్యాహ్నం నుంచి పంపిణీ

### ఆ రోజు తీసుకోలేని వారికి అక్టోబర్ 3న పింఛను

### లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ల పంపిణీ

### జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ

గుంటూరు, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): జిల్లాలో అక్టోబర్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అక్టోబర్ 1వ తేదీ మధ్యాహ్నం నుంచి పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. జాతీయ బ్యాంకు ఉద్యోగుల సమ్మె కారణంగా అక్టోబర్ 1వ తేదీ ఉదయం బ్యాంకుల నుంచి నగదు తీసుకుని, అదే రోజు మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1న పింఛను తీసుకోలేని లబ్ధిదారులకు అక్టోబర్ 3వ తేదీన పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బ్యాంకుల నుంచి నగదు పొందడం, సిబ్బంది కేటాయింపు, పింఛన్ల పంపిణీ సక్రమంగా, సాఫీగా జరిగేలా ముందస్తు కార్యాచరణ రూపొందించుకుని పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు..!

### ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

### 11, 12, 13, 14వ వార్డుల్లో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

### కాలనీల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని.. అధికారులతో సమీక్ష

### వార్డుల అభివృద్ధికి అవసరమైన పనులపై ప్రత్యేక దృష్టి



మాచర్ల సెప్టెంబర్ 27 :(మహి న్యూస్): మాచర్ల పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. ఆదివారం పట్టణ పరిధిలోని 11, 12, 13, 14వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. రోప్‌లైన్, ఎస్సీ, చెంచు, గౌడ, ఎర్రగడ్డ, విశ్వబ్రాహ్మణ కాలనీల్లో పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విశ్వబ్రాహ్మణ కాలనీలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గన్నోజు శంకరాచారి, బాలకృష్ణాచారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కజ్జం సైదయ్య, మద్దిగపు చిన వెంకటరామిరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, కంభంపాటి అనిల్‌కుమార్, శశిరెడ్డి, షేక్ జానీ, చెన్నకేశవులు, భవాని శంకర్, జంధ్యాల సత్యనారాయణ, వేముల గంగమ్మ, శంకర్ నాయక్, మల్లెల శివశంకర్, డేవిడ్ చెన్నయ్య, గడ్డం అంజి తదితరులు పాల్గొన్నారు.



# పీజీఆర్ఎస్‌పై క్యూ.ఆర్. కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

### జిల్లా, మండల స్థాయి కేంద్రాల్లో క్యూ.ఆర్. కోడ్‌ల ఏర్పాటు

### సేవలు పొందిన వెంటనే స్పందన తెలియజేసే అవకాశం

### అర్జీల స్థితిగతుల కోసం 1100కు ఫోన్ చేయవచ్చు

### జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల




పల్నాడు, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): ప్రజా సమస్యల పరిష్కార వేదికపై ప్రజలు తమ స్పందనను క్యూ.ఆర్. కోడ్ ద్వారా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించడంతో పాటు ప్రజల సంతృప్తిని మెరుగుపరిచేందుకు నిరంతరం అభిప్రాయాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లా, మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కేంద్రాలను సందర్శించే ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు క్యూ.ఆర్. కోడ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. జిల్లా, మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో క్యూ.ఆర్. కోడ్‌లను స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాల్లో నోటీసు బోర్డులు, సహాయ కేంద్రాలు, ఫిర్యాదుల కౌంటర్ల వద్ద కూడా క్యూ.ఆర్. కోడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూ.ఆర్. కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చని తెలిపారు. ప్రజల స్పందన అధికారిక ప్రజా సమస్యల పరిష్కార వేదిక పోర్టల్‌కు చేరుతుందని పేర్కొన్నారు. అర్జీల స్థితిగతులను తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించాలని, అనంతరం క్యూ.ఆర్. కోడ్ ద్వారా తమ స్పందనను తెలియజేయాలని కోరారు. ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక సేవలను సద్వినియోగం చేసుకుని తమ అభిప్రాయాలను తెలియజేయడం ద్వారా మరింత మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల విజ్ఞప్తి చేశారు.

# అమరావతిలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

### డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగ అభివృద్ధిపై అవగాహన

### విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చర్చా పోటీలు

### అమరావతి స్థూపం మీదుగా బుద్ధుని విగ్రహం వరకు వారసత్వ నడక

### కాలచక్ర మ్యూజియం ఆధునీకీకరణకు రూ.8 లక్షలు






అమరావతి, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): "డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం" అనే ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని అమరావతిలో ఘనంగా నిర్వహించారు. అధికారుల సూచనలు, జిల్లా కలెక్టర్ డా. కృతిక శుక్లా ఆదేశాల మేరకు అమరావతిలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అమరావతిలోని ఎస్సీ గురుకుల పాఠశాల (మహిళలు)లో విద్యార్థులకు పర్యాటక ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు క్విజ్, వ్యాసరచన, చర్చా పోటీలు నిర్వహించారు. అనంతరం ఉదయం 9 గంటలకు అమరావతి పురావస్తు మ్యూజియం నుంచి అమరావతి స్థూపం మీదుగా బుద్ధుని విగ్రహం వరకు వారసత్వ నడక చేపట్టారు. వారసత్వ నడక అనంతరం బుద్ధుని విగ్రహం పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసి, మొక్కలు నాటారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026 ఇతివృత్తానికి అనుగుణంగా పర్యాటక రంగంలో డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు వినియోగం, వారసత్వ పర్యాటక అభివృద్ధి, స్థిరమైన పర్యాటకంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు.

**కాలచక్ర మ్యూజియం ఆధునికీకరణకు రూ.8 లక్షలు**

అమరావతిలో పర్యాటక, చారిత్రక, బౌద్ధ వారసత్వ పరంగా ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన కాలచక్ర మ్యూజియాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో రూ.8 లక్షల వ్యయంతో ఆధునీకరించి అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. కృతిక శుక్లా తెలిపారు. మ్యూజియం ఆధునికీకరణ పనులను త్వరితగతిన చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. టెండర్ ప్రక్రియను త్వరలో పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాలచక్ర మ్యూజియం ఆధునికీకరణ పూర్తయితే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు, సమాచారాన్ని అందించడంతో పాటు అమరావతి బౌద్ధ, చారిత్రక వారసత్వానికి మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి నాయుడమ్మ, ఇంటాక్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ రవిశంకర్, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు, పల్నాడు జిల్లా పర్యాటక మండలి సభ్యులు డా. జాస్తి వీరాంజనేయులు, కోలా వెంకటేశ్వరరావు, అమరావతి ఎంపీడీవో శివ పార్వతి, డిప్యూటీ ఎంపీడీవో రాజబాబు, ఈవోపీఆర్డీ పద్మజ, ఎంఈవోలు శివబాబు, ప్రసాద్, అమరావతి యూనిట్ మేనేజర్ అశోక్, డీఈ కుమార్, మాజీ ఎంపీపీ మేకల హనుమంతరావు, గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

### అక్టోబర్ 4న బుర్రిపాలెంలో చంద్రబాబు పర్యటన

### ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 ప్రారంభం





గుంటూరు, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): తెనాలి మండలం బుర్రిపాలెంలో అక్టోబర్ 4న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి పర్యటన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0లో భాగంగా 3డీ సాంకేతికతతో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ, రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు అవార్డుల దరఖాస్తు గడువు

# అక్టోబర్ 5 వరకు పొడిగింపు

### 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు

### రూ.2 లక్షల నుంచి రూ.1 లక్ష వరకు నగదు పురస్కారాలు

### అక్టోబర్ 5 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు

### సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్



విజయవాడ, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): 2025 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తుల గడువును అక్టోబర్ 5 వరకు పొడిగించినట్లు సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ తెలిపారు. అర్హులైన జర్నలిస్టులు అక్టోబర్ 5 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జర్నలిజం రంగంలో ప్రతిభ కనబరిచిన వారికి 12 విభాగాల్లో అవార్డులు అందించనున్నారు. ఉత్తమ జర్నలిస్టు అవార్డుకు రూ.2 లక్షలు, ఇతర విభాగాల్లో రూ.1 లక్ష చొప్పున నగదు పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ జర్నలిస్టు, మహిళా జర్నలిస్టు, కార్టూనిస్టు, ఉర్దూ జర్నలిస్టు, ఎలక్ట్రానిక్ మీడియా, వీడియో జర్నలిస్టు తదితర విభాగాల్లో అవార్డులు ఉన్నాయి. వి.ఆర్. నార్ల జీవిత సాఫల్య పురస్కారం, ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు, చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకుల అవార్డులను ఎంపిక కమిటీ నేరుగా ఎంపిక చేయనుంది. దరఖాస్తుతో పాటు 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రచురితమైన లేదా ప్రసారమైన కనీసం ఐదు వార్తా కథనాలు, వ్యాసాలు, ఫొటోలు, కార్టూన్లు లేదా వీడియో క్లిప్పింగ్స్ జతచేయాలి. పూర్తి వివరాలను సమాచార పౌరసంబంధాల శాఖ మీడియా రిలేషన్స్ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని అధికారులు తెలిపారు.

# పురాతన ఆలయాల అభివృద్దే ధ్యేయం..!

### ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



దుర్గి సెప్టెంబర్ 27:(మహి న్యూస్) : పురాతన ఆలయాల అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. ఆదివారం మండల పరిధిలోని తేరాల గ్రామంలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ సిద్దేశ్వర స్వామి వారి ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం అభివృద్ధికి అవసరమైన పనుల గురించి గ్రామ ప్రజలను, వేద పండితులను అడిగి తెలుసుకున్నారు. పరుశురాముడుచే ప్రతిష్టించి, పూజలు అందుకుంటున్న స్వామివారి ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుజ్జుల పాపిరెడ్డి, ఎలీషా, పూజారి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యూపీలో వర్ష బీభత్సం..15 మంది మృతి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గత 48 గంటల్లో వర్షాలకు సంబంధించిన ఘటనల్లో 15 మంది మృతి చెందగా.. 17 మంది గాయపడ్డారు. పలు జిల్లాల్లో వరదలు, నీట మునిగిన ప్రాంతాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దక్షిణ--తూర్పు యూపీలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. తూర్పు యూపీతో పాటు మధ్య, తరాయ్ ప్రాంతాల్లో ఆకస్మిక వరదల ముప్పు ఉందని తెలిపింది. శనివారం ఒక్కరోజే రాష్ట్రంలోని 63 జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. గత 24 గంటల్లో సాధారణం కంటే దాదాపు 19 రెట్లు అధిక వర్షం కురిసింది. లక్నోలో 21 గంటల్లో 125.8 మి.మీ., ఫతేగఢ్‌లో 224 మి.మీ., బాందాలో 227.6 మి.మీ., నాన్పారాలో 217 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలు, ఈదురుగాలులకు చెట్లు, మట్టి ఇళ్లు కూలడంతో పాటు 117 ఇళ్లు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో పంటలు కూడా దెబ్బతిన్నాయి. మురాదాబాద్‌లోని జిల్లా పశువైద్య ఆసుపత్రిలోకి సైతం వరదనీరు చేరింది. ఆజంగఢ్, బలియా, గాజీపూర్, గోరఖ్‌పూర్, బస్తీ, సుల్తాన్‌పూర్, అయోధ్య, గోండా, హర్దోయ్, లక్నో, ఉన్నావ్, రాయ్‌బరేలీ, బారాబంకీ, అమేథీ, కౌశాంబీ, చిత్రకూట్ తదితర జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేపాల్‌లోనూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. వర్షాలు, వరదల పరిస్థితిపై సీఎం యోగి ఆదిత్యనాథ్ సమీక్షించారు. మృతుల కుటుంబాలకు, ఇళ్లు కోల్పోయిన వారికి, పంటలు నష్టపోయిన రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని, అత్యవసర సమస్యల కోసం 1912 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# బీసీలు అంటే బ్యాక్ వర్డ్ కాదు.. బ్యాక్ బోన్

### - వైఎస్సార్‌సీపీ నేతలు

తూర్పుగోదావరి : వెన్నుపోటు పార్టీ వంచనపై బీసీ గర్జన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ యాదవ్, బొత్స సత్యనారాయణ, విడదల రజిని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వారు విమర్శించారు. ఈ సందర్భంగా రాజ్యాధికారం ఉంటేనే సమాజం ముందుకెళ్లే అవకాశం ఉంటుందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాధికారంతోనే ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బలంగా ఉండగలమని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత బీసీలను ఏ ప్రభుత్వాలు గుర్తించాయి. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందనే అంశాన్ని ప్రజలు బేరీజు వేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలను బ్యాక్‌వర్డ్ కాదు బ్యాక్‌బోన్ అని చెప్పిన ఏకైక నాయకుడు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని రమేష్ యాదవ్ కొనియాడారు. యాదవ సమాజంలో ఇద్దరికి మంత్రివర్గంలో స్థానం కల్పించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని, ఉప ముఖ్యమంత్రి పదవిని బీసీ వర్గానికి కేటాయించాలని సభ ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము కూడా కింది స్థాయి నుంచి వచ్చిన వాళ్లమేనని పేర్కొన్న మాజీ మంత్రి విడదల రజిని.. ప్రస్తుత ప్రభుత్వంలో బీసీలకు ఎక్కడెక్కడ గుర్తింపు లోపించిందనే దానిపై అధ్యయనం జరగాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టం ఇప్పటిదాకా రాలేదని, మహిళలకు అందిస్తామన్న సహాయం అందలేదని, లబ్ధిదారులకు పింఛన్లు కూడా తగ్గిపోయాయని మండిపడ్డారు.ు

# రాహుల్.. ఇదేం విచిత్రమైన ప్రేమకథ: కేటీఆర్

**హైదరాబాద్: "తెలంగాణలో కాంగ్రెస్-బీజేపీ అపవిత్ర బంధానికి రెండేళ్లు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసాలపై ఈడీ దాడులకు రెండేళ్లు" అంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ట్వీట్ చేశారు. "2024 సెప్టెంబర్ 27న 16 ప్రాంతాల్లో ఈడీ సోదాలు. దాడుల సమయంలో నగదు లెక్కించే యంత్రాల తరలింపుపై వార్తలు. ఈడీ దాడుల్లో ఏం స్వాధీనం చేసుకున్నారో ఇప్పటికీ వెల్లడించలేదు. దాడుల ఫలితాలపై ఈడీ, కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తున్నాయి?" అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. "ప్రతిపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించే బీజేపీ.. కాంగ్రెస్ మంత్రిపై దాడుల విషయంలో మాత్రం ఎందుకీ మౌనం?. కాంగ్రెస్ మంత్రి పొంగులేటికి బీజేపీ ఎందుకు రక్షణ కల్పిస్తోంది?. రాహుల్ గాంధీ.. ఇదేం విచిత్రమైన ప్రేమకథ" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.**

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# పూతలపట్టు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్, జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ ఎం.బి కుమార్ రాజాను కలసిన జిల్లా యూత్ వింగ్ సెక్రటరీ కొంగాటం జగదీష్



చిత్తూరు జిల్లా బంగారుపాలెం సెప్టెంబర్ 27. : చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం తగ్గువారి పల్లి పంచాయతీకి చెందిన కొంగాటం జగదీష్ అంచలంచెలుగా ఎదిగి జిల్లా స్థాయిలో రాష్ట్ర వైఎస్ఆర్సిపి పార్టీ ఆదేశాల మేరకు నూతనంగా జిల్లా వింగ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా ఎన్నికైన జగదీష్ మాట్లాడుతూ, తాను వైయస్సార్సీపి పార్టీ ఆవిర్భావం నుంచి తగ్గు వారి పల్లి పంచాయతీలో యువతకు తోడ్పాటుగా అలాగే మండల స్థాయిలో నాయకుల మన్నలను పొంది ఈరోజు జిల్లా స్థాయిలో తనకు పదవి రావడం పట్ల ఎంతో ఆనందంగా ఉందని జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా పూతలపట్టు నియోజవర్గం మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్



స్వగృహంలో కలసి శాలువా కప్పి, బొకే అందజేసి తన అనుచరులతో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ ఎం బి కుమార్ రాజా స్వగృహంలో కలసి తనకు శాలువా కప్పి బొకే అందజేసి తన అనుచరులతో కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు పదవి రావడానికి సహకరించిన మాజీ మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిధున్ రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, పూతలపట్టు నియోజవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే లలిత థామస్, మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ ఎం బి కుమార్ రాజా, బంగారుపాలెం మండల కన్వీనర్ పాలేరు రామచంద్ర రెడ్డి, మండల వైస్ ఎంపీపీ శిరీస్ రెడ్డి, తగ్గువారి పల్లి వైఎస్ఆర్సిపి నాయకులకు, యువతకు పేరుపేరునా కొంగాటం జగదీష్ కృతజ్ఞతలు తెలియజేశారు. జగదీష్ తో పాటు తగ్గువారి పల్లి వైఎస్ఆర్సిపి పార్టీ యువత కార్యక్రమంలో పాల్గొన్నారు

# భాను ప్రకాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన క్రికెట్ విజయకుమార్..



తిరుపతి, సెప్టెంబర్ 27, మహి న్యూస్ : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యులు, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు భాను ప్రకాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని జనసేన పార్టీ సీనియర్ నాయకులు, తిరుపతి జిల్లా జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు విజయకుమార్ (క్రికెట్ విజయ్) మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ రెడ్డిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి, భగవద్గీత గ్రంథాన్ని బహూకరించారు. ప్రజాసేవ, ధార్మిక సేవల పట్ల ఆయన చూపుతున్న అంకితభావం అభినందనీయమని విజయకుమార్ కొనియాడారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహంతో భాను ప్రకాష్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులను అధిరోహిస్తూ ప్రజలకు, హిందూ ధార్మిక విలువలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ విజయకుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ యాదవ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సతీష్ యాదవ్ పాల్గొని భాను ప్రకాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఈ నెల 28 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ




తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 27 : - ఈ నెల 28 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. - అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు అలాగే పిజిఆర్ఎస్ పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయాలన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam. ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 28 వ తేదీన సోమవారం తిరుపతి కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గిరిజనులకు అన్యాయం చేస్తున్న రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు...



ఓజిలి, సెప్టెంబర్ 27, మహి న్యూస్: తిరుపతి జిల్లా, ఓజిలి మండలంలో గిరిజనుల అభివృద్ధి కొరకు ప్రభుత్వం ఇచ్చిన భూములను ఇతర కులస్థులు దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు చేస్తున్న నేపథ్యంలో మండల రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. గతంలో జరిగిన సర్వేల ఆధారంగా రెవెన్యూ రికార్డులలో ఆక్రమణలు జరిగాయని తెలిసినప్పటికీ ఏమాత్రం అధికార యంత్రాంగం పట్టించుకోకపోగా, ఆక్రమణదారుల దగ్గర ప్రతి ఏటా మామూళ్లు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిరక్షరాస్యత, సమాజం పట్ల అవగాహన లోపం చేత గిరిజనులు ఇంకా వెనుకబడిపోతుండడం జరుగుతుందని, దీనికి ముఖ్య కారణం గిరిజన భూముల సంరక్షణలో అధికారుల వైఫల్యమని చెప్పవచ్చు. అంతేకాకుండా ఓజిలి మండలంలో కొంతమేర ఫారెస్ట్ భూములు కూడా గతంలో ప్రభుత్వం గిరిజనులకు సాగు కొరకు ఇవ్వడం జరిగింది. అయితే ప్రస్తుతం ఆ భూములు కూడా గిరిజనుల చేతిలో లేవని స్పష్టంగా తెలుస్తుంది. తరచూ ప్రభుత్వ భూములపై పర్యవేక్షణ జరపాల్సిన విలేజ్ రెవెన్యూ అధికారులు కూడా ఆక్రమణదారులతో చేతులు కలిపి ఎంతోమంది గిరిజన కుటుంబాలకు అన్యాయం చేస్తున్నారు. ఇకనైనా తిరుపతి జిల్లా కలెక్టర్ ఓజిలి మండలంలో గిరిజనులకు ఇచ్చిన భూములను పరిశీలించి, ఆక్రమణదారుల చెర నుండి కాపాడాలని గిరిజన సంఘాలు జిల్లా అధికారులను కోరుతున్నారు.

# అక్టోబరు 12 నుండి 20వ తేదీ వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

## అక్టోబరు 16న గరుడ వాహనం, 17న పుష్పకవిమానం, అక్టోబరు 19న స్వర్ణరథం, 20న చక్రస్నానం

తిరుమల, సెప్టెంబర్ 27 మహి న్యూస్ : శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12 నుండి 20వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకోసారి అధికమాసం వస్తుంది. ఇలావచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవు. ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ రాత్రి 6.30 నుండి 11.30 గంటల వరకు జరుగుతుంది. ఈ బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వైశిష్ట్యం ఇలా ఉంది.



**వాహన సేవల వివరాలు :**

అక్టోబరు 11 - అంకురార్పణం - రాత్రి 7 నుండి 9 గంటల వరకు

అక్టోబరు 12 - బంగారు తిరుచ్చి ఉత్సవం - ఉదయం 9 గంటలకు

పెద్దశేష వాహనం - రాత్రి 7 గంటలకు

అక్టోబరు 13 - చిన్నశేష వాహనం - ఉదయం 8 గంటలకు

హంస వాహనం - రాత్రి 7 గంటలకు

అక్టోబరు 14 - సింహ వాహనం - ఉదయం 8 గంటలకు

ముత్యపుపందిరి వాహనం - రాత్రి 7 గంటలకు

అక్టోబరు 15 - కల్పవృక్ష వాహనం - ఉదయం 8 గంటలకు

సర్వభూపాల వాహనం - రాత్రి 7 గంటలకు

అక్టోబరు 16 - మోహినీ అవతారం - ఉదయం 8 గంటలకు

గరుడ వాహనం - సాయంత్రం 6.30 గంటలకు

అక్టోబరు 17 - హనుమంత వాహనం - ఉదయం 8 గంటలకు

పుష్పక విమానం - సాయంత్రం 4 గంటలకు

గజ వాహనం - రాత్రి 7 గంటలకు

అక్టోబరు 18 - సూర్యప్రభ వాహనం - ఉదయం 8 గంటలకు

చంద్రప్రభ వాహనం - రాత్రి 7 గంటలకు

అక్టోబరు 19 - స్వర్ణరథం - ఉదయం 7 గంటలకు

అశ్వ వాహనం - రాత్రి 7 గంటలకు

అక్టోబరు 20 - చక్రస్నానం - ఉదయం 6 గంటలకు

# బధిరులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది

చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 27: బధిరులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ బధిరుల దినోత్సవం మరియు సంజ్ఞల భాషా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా స్థాయి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాలన్నీ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వి. పుల్లారెడ్డి, ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ ఏ. మురళి, డెఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హేమంత్, సంబంధిత అధికారులు, బధిరుల సంఘాల ప్రతినిధులు, బధిరులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సమాన గౌరవం, అవకాశాలు పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బధిరులు, విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి ప్రభుత్వ పరంగా, తన వంతుగా అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇల్లు, ఇంటి స్థలం వంటి సమస్యలు ఉన్న అర్హుల వివరాలను తనకు అందించాలని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే బధిరులు, విభిన్న ప్రతిభావంతుల కోసం ఆరోగ్య శిబిరాలను నిర్వహించి అవసరమైన వైద్య సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ అవసరమైన సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన నందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. బధిరులు సమాజంలో సమాన అవకాశాలతో ముందుకు సాగేందుకు అవసరమైన సహాయాన్ని అందించడంతో పాటు, వారి ప్రతిభను గుర్తించి అవసరం ఉందని ప్రోత్సహించాల్సిన పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వి. పుల్లారెడ్డి మాట్లాడుతూ బధిరుల హక్కులు, వారి సంస్కృతి, సామర్థ్యాలు మరియు విజయాలపై సమాజంలో అవగాహన పెంపొందించడమే అంతర్జాతీయ బధిరుల దినోత్సవ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమన్నారు. 1958 నుంచి సెప్టెంబర్ 22 నుంచి 28వ తేదీ వరకు బధిరుల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల్లో బధిరుల హక్కులు, సంకేత భాష హక్కులు, సమాజంలో వారి భాగస్వామ్యం, సమాన అవకాశాలపై అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. సంకేత భాష బధిరుల మధ్య భావవ్యక్తీకరణకు మాత్రమే పరిమితం కాకుండా, బధిరులు కాని వారు కూడా దానిపై కనీస అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని పుల్లారెడ్డి పేర్కొన్నారు. సంకేత భాష( బ్రెయిన్ లిపి) పై అవగాహన పెరిగినప్పుడు బధిరులు తమ సమస్యలు, అభిప్రాయాలు, అవసరాలను సమర్థవంతంగా ఇతరులకు తెలియజేయగలరని, తద్వారా సమాజంలో పరస్పర అవగాహన, సహానుభూతి మరింత పెరుగుతుందని తెలిపారు. బధిరుల సమస్యలను అర్థం చేసుకుని, వారికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వ శాఖలతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. బధిరులకు విద్య, ఉపాధి, వైద్యం, సామాజిక భద్రత, సంక్షేమ పథకాల ప్రయోజనాలు సమర్థవంతంగా అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ ఏ. మురళి, డెఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హేమంత్, సంబంధిత అధికారులు, బధిరుల సంఘాల ప్రతినిధులు, బధిరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేటలో తిరుగులేని శక్తిగా తెలుగుదేశం

సూళ్ళూరుపేట, సెప్టెంబర్ 27, మహి న్యూస్: తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయ ఘంట మోగించడమే కాకుండా, రాబోయే రోజుల్లో తిరుగులేని శక్తిగా ఎదుగుతోందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తెలుగుదేశం పార్టీ తరఫున సూళ్లూరుపేట శాసనసభ్యురాలిగా గెలుపొందిన డాక్టర్ నెలవల విజయశ్రీ నియోజకవర్గ నాయకత్వానికి సరికొత్త రూపురేఖలు దిద్దుతున్నారు. విజయం సాధించిన తొలిరోజు నుంచే ప్రజల్లో ఉంటూ, నిత్యం ప్రజాక్షేత్రంలో పర్యటిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

### కేడర్కు అండగా, కార్యకర్తలకు కొండంత బలంగా..

రాజకీయాల్లో నాయకుని బలం కార్యకర్తలే అని నమ్మే ఎమ్మెల్యే విజయశ్రీ కేడర్ను కాపాడుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకూ ఏ కష్టం వచ్చినా "నేనున్నాను" అనే భరోసానిస్తున్నారు. నిత్యం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి బాధలను నేరుగా విని పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారు. శ్రేణుల్లో ఉత్సాహం



నింపుతూ, నాయకులను, కార్యకర్తలను ఒకే తాటిపైకి తెస్తూ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తున్నారు.

### సమస్య ఏదైనా, తక్షణమే స్పందన.

మంచినీటి సమస్య, రహదారుల పునర్నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ లేదా స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో ఎదురయ్యే ఇబ్బందులు. సమస్య చిన్నదా, పెద్దదా అని చూడకుండా ప్రతి విషయంపైనా ఆమె సానుకూలంగా స్పందిస్తున్నారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేస్తున్నారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే ఆమె శైలి నియోజకవర్గ ప్రజల మనసులను గెలుచుకుంటోంది.

### స్థానిక పోరుకు సమిష్టి వ్యూహంతో గెలుపే ఏకైక ధ్యేయం.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగరవేసేందుకు ఎమ్మెల్యే విజయశ్రీ ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం సాధిస్తూ సమిష్టి కృషితో ముందుకు సాగుతున్నారు. సూళ్లూరుపేట కోటపై టీడీపీ ఎప్పటికీ తిరుగులేని శక్తిగా నిలవాలనే సంకల్పంతో గ్రామ గ్రామాన పర్యటిస్తూ, ప్రజల అవసరాలు తీరుస్తూ జనం మెచ్చిన మహిళా శక్తిగా దూసుకుపోతున్నారు. మహిళా నాయకురాలిగా, వైద్యురాలిగా, ప్రజాప్రతినిధిగా ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న డాక్టర్ నెలవల విజయశ్రీ నాయకత్వంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి సరికొత్త ప్రజాదరణ లభిస్తోందని స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పర్యాటక ప్రోత్సాహంలో కడపకు రెండు రాష్ట్రస్థాయి అవార్డులు ..!




కడప జిల్లా/రాజమహేంద్రవరం, మహి న్యూస్ సెప్టెంబరు 27: గండికోటలో సమగ్ర పర్యాటక అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలకు, పులివెందుల డాక్టర్ వైఎస్ఆర్ బస్ టెర్మినల్ను పర్యాటకులకు అనుకూలంగా తీర్చిదిద్దిన నిర్వహణకు రాష్ట్రస్థాయి అవార్డులు లభించడం జిల్లా యంత్రాంగం సమష్టి కృషికి దక్కిన గౌరవమని జిల్లా కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి చైర్పర్సన్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని మంజీరా కన్వెన్షన్ హాలులో.. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ, ఎపిటిడిసి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరికి కళలు - సంస్కృతి ద్వారా పర్యాటక ప్రోత్సాహం విభాగంలో పర్యాటక అత్యుత్తమ అవార్డును అందజేశారు. అదే కార్యక్రమంలో 2025--26 సంవత్సరానికి ఉత్తమ పర్యాటక అనుకూల బస్ స్టాండ్ విభాగంలో పులివెందుల డాక్టర్ వైఎస్ఆర్ బస్ టెర్మినల్కు పర్యాటక శాఖ అత్యుత్తమ అవార్డు లభించింది. పులివెందుల ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ. ప్రేమ్ కుమార్, సంబందిత ఆర్టీసీ అధికారులు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యాటక రంగ అభివృద్ధి, చారిత్రక వారసత్వ పరిరక్షణ, ప్రకృతి అందాల ప్రాచుర్యం, సాహస పర్యాటకానికి ప్రోత్సాహం, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో వైఎస్ఆర్ కడప జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని అన్నారు. గండికోటను కేవలం ఒక చారిత్రక ప్రదేశంగా కాకుండా వారసత్వం, ప్రకృతి, సాహసం, సంస్కృతి కలయికగా ఉన్న అంతర్జాతీయ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పర్యాటక శాఖతో పాటు వివిధ శాఖల సమన్వయంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గండికోట అభివృద్ధిలో భాగంగా ఎస్ఏఎస్సీఐ పథకం కింద సుమారు రూ.19 కోట్లతో వివిధ మౌలిక వసతుల పనులు చేపట్టినట్లు తెలిపారు. 16 కిలోమీటర్ల రెండు వరుసల రహదారి, 24 గంటల విద్యుత్, తాగునీటి సౌకర్యం, పర్యాటకుల సహాయ కేంద్రాలు, లోయ వీక్షణ ప్రదేశాలు, వెలుగులతో కూడిన కోట మార్గాలు, ప్రజా సౌకర్యాల సముదాయాలు, గుర్రపు స్వారీ వంటి సదుపాయాలను అభివృద్ధి చేసినట్లు వివరించారు. గండికోటలో సాహస పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రాతి గోడలెక్కడం, తాళ్లతో దిగడం, తాడుపై ప్రయాణం, కయాకింగ్ వంటి సాహస క్రీడలను అందుబాటులోకి తీసుకువచ్చామని కలెక్టర్ తెలిపారు. నదీతీర గుడారాల వసతి, నక్షత్ర వీక్షణ, సూర్యోదయ యోగా, కొండ ప్రాంతాల్లో మార్గదర్శక పర్యటనలు వంటి కార్యక్రమాలతో పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించేలా చర్యలు చేపట్టామన్నారు. మైలవరం జలాశయం పరిసరాల్లోనూ జల క్రీడలు, పర్యావరణ అనుకూల వసతులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ - గండికోట మధ్య కారవాన్ పర్యాటక సేవలు, పర్యాటక వసతుల అభివృద్ధి, దప్పర్ల - మైలవరం ప్రాంతాల్లో పర్యావరణ అనుకూల వసతులు, పడవ విహార కేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు గండికోట పర్యాటక ప్రాధాన్యతను మరింత పెంచుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో పెన్నా నది లోయపై రోప్వే, అద్దాల వంతెన, ఆకాశ వంతెన, బంగీ జంపింగ్, హాట్ ఎయిర్ బెలూనింగ్ వంటి మరిన్ని ఆకర్షణలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

గండికోట ఉత్సవం ద్వారా దేశవ్యాప్త ప్రచారం..

2026 జనవరి 11 నుంచి 13 వరకు నిర్వహించిన గండికోట ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించడం ద్వారా గండికోటకు దేశవ్యాప్త ప్రచారం కల్పించామని కలెక్టర్ తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఉత్సవంలో ప్రముఖ కళాకారుల సంగీత ప్రదర్శనలు, ధ్వని--వెలుగు కార్యక్రమాలు, లేజర్ ప్రదర్శనలు, పరామోటార్ విహారం, హెలికాప్టర్ విహారాలు వంటి కార్యక్రమాలు నిర్వహించామని, వేలాది మంది పర్యాటకులు పాల్గొన్నారని చెప్పారు. దీనివల్ల స్థానిక కళాకారులు, వ్యాపారులు, హోటళ్లు, ఆహార విక్రయదారులకు ఆదాయంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో స్థానిక ప్రజల భాగస్వామ్యానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. గండికోటలో ప్రవేశ రుసుము, వాహనాల పార్కింగ్ రుసుముల వసూళ్లను క్రమబద్ధీకరించి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 2024 సెప్టెంబరు నుంచి 2026 జనవరి వరకు 1,75,935 మంది పర్యాటకులు, 16,544 వాహనాలు నమోదై రూ.58.40 లక్షల ఆదాయం సమకూరిందని, ఇందులో 80 శాతం పర్యాటక ప్రాంత అభివృద్ధికి, 20 శాతం గండికోట గ్రామపంచాయతీ అభివృద్ధికి కేటాయిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యాటకుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పర్యాటక పోలీసు కేంద్రం, సీసీ కెమెరాలు, ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సేవల అనుసంధానం వంటి చర్యలు చేపట్టామని, భారత పురావస్తు శాఖతో సమన్వయంతో చారిత్రక కట్టడాల పరిరక్షణ పనులు కొనసాగిస్తున్నామని చెప్పారు.

పర్యాటకులకు సౌకర్యవంతమైన బస్టాండ్.. పులివెందులకు మరో గుర్తింపు

పులివెందుల డాక్టర్ వైఎస్ఆర్ బస్ టెర్మినల్కు లభించిన రాష్ట్రస్థాయి అవార్డు కూడా ప్రయాణికులకు అందిస్తున్న మెరుగైన సౌకర్యాలకు గుర్తింపుగా నిలిచిందని కలెక్టర్ తెలిపారు. బస్ టెర్మినల్లో 225 మంది కూర్చునే సదుపాయం, 95 బెంచీలు, నిరీక్షణ మందిరం, 13 మరుగుదొడ్లు, రెండు ఆహార విక్రయ కేంద్రాలు, విచారణ కేంద్రం, ఆటో సౌకర్యం వంటి వసతులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నిరంతర పరిశుభ్రత, 26 చెత్త బుట్టల నిర్వహణ, 15 సమాచార సూచికలు, దివ్యాంగుల కోసం వీల్చైర్, ప్రత్యేక మరుగుదొడ్డి వంటి సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. పులివెందుల బస్ టెర్మినల్ నుంచి 26 ప్రధాన మార్గాలకు వివిధ రకాల బస్సు సర్వీసులు నడుస్తున్నాయని, పట్టణ పరిధిలో ప్రయాణికులకు సులభంగా రవాణా అందుబాటులో ఉండేలా షేర్ ఆటో సౌకర్యం కూడా ఉందని వివరించారు. ప్రయాణికుల భద్రత కోసం 55 సీసీ కెమెరాలతో 24 గంటల నిఘా, భద్రతా సిబ్బంది, ఆర్వో ప్లాంట్ ద్వారా ఉచిత సురక్షిత తాగునీరు, ఎల్ఈడీ దీపాలతో నిరంతర వెలుగు, విచారణ కేంద్రంలో ప్రథమ చికిత్స పెట్టె వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. టికెట్ కౌంటర్లు, క్యాంటీన్లో నగదు రహిత చెల్లింపుల సదుపాయాన్ని కల్పించడంతో పాటు ప్రజా ప్రకటన వ్యవస్థ ద్వారా బస్సుల రాకపోకల సమాచారాన్ని ప్రయాణికులకు అందిస్తున్నామని చెప్పారు.

అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి కలెక్టర్ అభినందనలు..

జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి లభించిన రెండు రాష్ట్రస్థాయి అవార్డులు ఒక్కరి కృషికి దక్కినవి కాదని, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేసిన సమష్టి కృషికి లభించిన గుర్తింపని డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. గండికోటలో పర్యాటక వసతుల అభివృద్ధి నుంచి పర్యాటకుల భద్రత, పరిశుభ్రత, వారసత్వ పరిరక్షణ వరకు బాధ్యతగా పనిచేస్తున్న పర్యాటక శాఖ అధికారులు, పులివెందుల బస్ టెర్మినల్ను పర్యాటకులకు అనుకూలంగా నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేస్తున్న సిబ్బంది అంకితభావం వల్లే పర్యాటకులకు మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో వచ్చిన ఈ గుర్తింపు జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని, భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టి మరిన్ని ఉత్తమ అవార్డులను జిల్లాకు సాధించేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆకాంక్షించారు. వైఎస్ఆర్ కడప జిల్లాను చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి, సాహస, పర్యావరణ, గ్రామీణ పర్యాటకానికి సమగ్ర కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ రెండు అవార్డుల ద్వారా జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చిన ప్రతి ఒక్కరికీ జిల్లా యంత్రాంగం తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com

# కల్లూరు 29వ వార్డులో రూ.1.40 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ



**రూ.90 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం**
**రూ.50 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం**
**పనులకు భూమిపూజ చేసి శిలాఫలకాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి**

కర్నూలు, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): కల్లూరు అర్బన్ 29వ వార్డు సప్తగిరి నగర్‌లోని వివిఎస్ ఫంక్షన్ హాల్ రోడ్డులో రూ.1.40 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ నిధుల్లో రూ.90 లక్షలతో సీసీ రోడ్లు, రూ.50 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఆయా పనులు పూర్తయితే వార్డులో రహదారులు, డ్రెయినేజీ సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు స్థానికులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్కే శ్రీనివాసరావు, వీరేంద్ర కుమార్, సర్దార్, నరసింహ, కుమ్మరి రామకృష్ణ, లింగన్న, ఎరుకలి కుమార్, బబ్లూ, జనసేన పార్టీ నాయకుడు షబ్బీర్‌తో పాటు మున్సిపల్ అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నంద్యాలలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

**పర్యాటక ప్రాంతాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయాలి**
**ప్లాస్టిక్ రహిత వాతావరణం, పరిశుభ్రతకు ప్రాధాన్యం**
**యాగంటి, అహోబిలంలో రోప్‌వేలకు ప్రతిపాదనలు**



నంద్యాల, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను నంద్యాల కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ పర్యాటకం అంటే కేవలం ప్రాంతాలను సందర్శించడం మాత్రమే కాకుండా వాటి చరిత్ర, సంస్కృతి, విశిష్టతలను తెలుసుకోవడమన్నారు. జిల్లాలోని శ్రీశైలం, మహానంది, యాగంటి, అహోబిలం తదితర పర్యాటక ప్రాంతాలను విద్యార్థులు, యువత సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పర్యాటకుల రాక పెరిగితే స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పరిశుభ్రతను పాటించాలని కోరారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి సునీల్ కన్నా మాట్లాడుతూ జిల్లాలో 28 ప్రముఖ పర్యాటక ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. యాగంటి, అహోబిలంలో రోప్‌వే ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వ్యాసరచన, చిత్రలేఖనం, లఘుచిత్రాల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# నేడు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**ఉదయం 10 గంటల నుంచి వినతుల స్వీకరణ**
**సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం**
**జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్**



నంద్యాల, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను మీకోసం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, దరఖాస్తుల పరిష్కార స్థితిని 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. మండల, రెవెన్యూ డివిజన్, మున్సిపల్ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమర్పించాలని సూచించారు.

# నేడు నగరపాలక సంస్థలో అర్జీల స్వీకరణ

**ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక**
**కమిషనర్ చల్లా ఓబులేసు**



కర్నూలు, సెప్టెంబర్ 28: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పరిశుభ్రత తదితర సమస్యలను ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. కార్యక్రమానికి రాలేని వారు 7422992299 నంబర్‌కు కాల్ చేయడం లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు తెలియజేయవచ్చని కమిషనర్ సూచించారు.

# రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్

**నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి**
**చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి**
**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్**




కర్నూలు, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగినవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు. సత్ప్రవర్తనతో జీవిస్తూ నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





# ఏఐతో పర్యాటక రంగానికి మరింత ఊతం

**పర్యాటక ప్రాంతాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం కీలకం**
**కర్నూలు జిల్లాలో ఆలయాలు, చారిత్రక ప్రాంతాలను అనుసంధానిస్తూ పర్యాటక అభివృద్ధి**
**యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలి**
**జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**

కర్నూలు, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): పర్యాటక రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగాన్ని మరింత విస్తరించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని



సునయన ఆడిటోరియంలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. డిజిటల్ విధానాలు, కృత్రిమ మేధస్సు ద్వారా పర్యాటక రంగాన్ని పునఃరూపకల్పన చేయడమే ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవం ప్రధాన ఉద్దేశమన్నారు. కర్నూలు జిల్లాలో చారిత్రక, ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కొండారెడ్డి బురుజుతో పాటు మంత్రాలయం, పెద్దతుంబళంలోని జైన దేవాలయం, రామాలయం, ఉరుకుంద తదితర ప్రాంతాలను అనుసంధానిస్తూ ఆలయ పర్యాటక వలయంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రాలయానికి బెంగళూరు, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇతర పర్యాటక ప్రాంతాలను కూడా సందర్శించేలా ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను రూపొందించి, వాటిని



అంతర్జాలంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. దీనివల్ల పర్యాటకుల బస సమయం పెరగడంతో పాటు స్థానిక హోటళ్లు, ఆహారం, రవాణా, ఇతర వ్యాపారాలకు ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద విడిది కేంద్రం, నౌకాయానం తదితర సౌకర్యాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. రాంజల చెరువు, సుంకేశుల బ్యారేజీ ప్రాంతాల్లోనూ పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

## పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరం



పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కర్నూలు నగరంలోని కేసీ కెనాల్‌ను శుభ్రం చేసిన అనంతరం ప్రజలు నడక, విశ్రాంతి కోసం ఆ ప్రాంతాన్ని వినియోగించుకోవడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. పర్యాటక ప్రాంతాలు, కాలువలు, నదులు, రహదారులు తదితర ప్రాంతాల్లో చెత్త వేయకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జపాన్‌లో ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తమతో పాటు తీసుకెళ్లి తడి, పొడి చెత్తను వేరు చేసి నిర్వహించే విధానాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు. మన ప్రాంతాల్లోనూ ప్రజల ప్రవర్తనలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టిన 'పరిశుభ్రత కార్యక్రమం' ద్వారా ప్రజా మరుగుదొడ్లు, మార్కెట్ ప్రాంతాలు, రైల్వే స్టేషన్లు, బస్‌స్టాండ్లు, రహదారులు, కాలువలను శుభ్రం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజలు తిరిగి చెత్త వేస్తే ఆశించిన ఫలితాలు సాధించలేమన్నారు.

## పర్యాటక రంగంలో ఏఐ కీలకం

ప్రస్తుతం పోలీసు శాఖతో పాటు వివిధ రంగాల్లో కృత్రిమ మేధస్సు, కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇస్తున్నారని కలెక్టర్ తెలిపారు. సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు, నేర పరిశోధన, వేలిముద్రల విశ్లేషణ వంటి అంశాల్లో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా



నేరాలను వేగంగా ఛేదించే అవకాశం ఏర్పడుతోందన్నారు. పర్యాటక రంగంలోనూ కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్లలో తాము వెళ్లాలనుకునే ప్రాంతాల గురించి శోధించినప్పుడు వారి ఆసక్తికి అనుగుణంగా సమాచారం అందుబాటులోకి వస్తోందని తెలిపారు. ప్రయాణికుల బడ్జెట్‌కు అనుగుణంగా ప్రయాణ టికెట్లు, హోటళ్లు, ప్రయాణ మార్గాలు, పర్యాటక ప్రాంతాలు, పర్యాటక ప్యాకేజీలను సూచించే స్థాయికి సాంకేతికత అభివృద్ధి చెందుతోందన్నారు. విమాన ప్రయాణంలోనూ సాంకేతిక పరిజ్ఞానం వల్ల ప్రయాణికులకు మరింత సౌకర్యం కలుగుతోందన్నారు. డిజిటల్ ప్రయాణ సదుపాయాల ద్వారా ప్రయాణికుల గుర్తింపు, జీవ కొలమాన వివరాలు, టికెట్, ప్రవేశ పత్రం వంటి అంశాలను అనుసంధానించడం ద్వారా విమానాశ్రయాల్లో క్యూలను తగ్గించి వేగవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించవచ్చన్నారు. కర్నూలుకు విమానాశ్రయం ఉండటం, బెంగళూరు--హైదరాబాద్ నగరాలకు సమీపంలో ఉండటం జిల్లాకు అనుకూల అంశాలన్నారు. విమానాశ్రయం అందుబాటులో ఉండటం వల్ల పర్యాటకులతో పాటు పరిశ్రమలు కూడా జిల్లాకు ఆకర్షితమయ్యే అవకాశం ఉందన్నారు.

## యువత లక్ష్య సాధనకు కృషి చేయాలి

యువత, ముఖ్యంగా విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరుచుకుని కష్టపడి చదవాలని కలెక్టర్ సూచించారు. మొబైల్ ఫోన్లను అనవసర వినియోగానికి కాకుండా విజ్ఞానం, నైపుణ్యాల పెంపుదలకు ఉపయోగించుకోవాలని తెలిపారు. అమ్మాయిలకు ఉన్నత విద్య అందించి, వారు తమకు నచ్చిన రంగంలో వృత్తిని ఎంచుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్న వారికి, వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి తిరుమల నాయుడు, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్, గిరిజన సంక్షేమ అధికారి సురేష్, మత్స్య శాఖ అధికారి రంగనాథ్, ఆర్ఐఓ లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఓర్వకల్లు భూవారసత్వ ప్రదేశంలో స్వచ్ఛత కార్యక్రమం

**జీఎస్ఐ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం**
**ఏపీటీడీసీకి చెత్త సేకరణ పాత్రలు అందజేత**
**పారిశుధ్య కార్మికులకు స్వచ్ఛత కిట్ల పంపిణీ**
**ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రతపై అవగాహన**






కర్నూలు, సెప్టెంబర్ 27: (మహి న్యూస్): కర్నూలు జిల్లా ఓర్వకల్లు లోని భూవారసత్వ ప్రదేశంలో భారత భూవిజ్ఞాన సర్వేక్షణ సంస్థ (జీఎస్ఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం--6.0లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ), గనులు-భూగర్భశాస్త్ర శాఖ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. సమీప ప్రాంతాల్లోని జీఎస్ఐ క్షేత్ర శిబిరాల అధికారులు, సిబ్బంది కూడా స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. భూవారసత్వ ప్రదేశంలో చెత్తను సక్రమంగా సేకరించి నిర్వహించేందుకు వీలుగా జీఎస్ఐ ఆధ్వర్యంలో చెత్త సేకరణ పాత్రలను ఏపీటీడీసీకి అందజేశారు. అలాగే పారిశుధ్య కార్మికులకు స్వచ్ఛత కిట్లను పంపిణీ చేశారు. పరిశుభ్రత అనేది ఒక్కరోజుతో ముగిసే కార్యక్రమం కాదని, నిరంతరం కొనసాగించాల్సిన సామూహిక బాధ్యత అని నిర్వాహకులు తెలిపారు. ఒరవకల్లు వంటి పర్యాటక, భూవారసత్వ ప్రదేశాల పరిశుభ్రతతో పాటు వాటి పర్యావరణ, వారసత్వ విలువలను కాపాడేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు.

# సీఎం పర్యటనకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



మదనపల్లె, మహి న్యూస్ సెప్టెంబర్ 27: అక్టోబర్ 2న మదనపల్లెకు రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం మదనపల్లె చంద్రకాలనీ, బీకేపల్లి, వెన్నెల రెస్టారెంట్ వెనుక ప్రాంతాల్లో కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, సీఎం పర్యటన సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ భాష, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి తదితరులు సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను మరోమారు పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సభా ప్రాంగణంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియాకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పార్కింగ్, బారికేడ్లు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖలు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజల రాకపోకలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నిశ్చల్ నాగిరెడ్డి జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 27: రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుమారుడు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని రాయచోటిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్ ఆధ్వర్యంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శించిన గండికోట సుధాకర్ రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను కేవలం ఆర్భాటాలకు పరిమితం చేయకుండా పేదలు, రోగులకు సేవ చేయడం ద్వారా జరుపుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి పరిసరాల్లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గండికోట సుధాకర్ పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే దేశ సంపద... డాక్టర్ శంకర్ శర్మ.....

కర్నూలు కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ లు బాలశివ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్. శంకర్ శర్మ పాల్గొని బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు మంచిగా ఉండే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలను మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ ఇప్పించడం చాలా అవసరం అన్నారు. మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ తీసుకున్న మహిళలు ఎలాంటి సమస్యలైనా ఎదుర్కొనే ధైర్యం ఉంటుందని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. ప్రతి పాఠశాలలో స్పోర్ట్స్ టీచర్ ను పెట్టి విద్యార్థులతో గంటసేపు క్రీడలు ఆడించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం యువత మాదక ద్రవ్యాలకు ఎక్కువగా అలవాటు పడుతున్నారని వీటిని అత్యవసరంగా నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మత్తుపదార్థాలను తీసుకున్న యువత అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. దేశ సంపద అయిన యువతను చిన్నారులను రక్షించుకొని భారత దేశ గౌరవాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్ శర్మ క్రీడాకారులకు పౌష్టికాహారమైన ఆపిల్, అరటిపండు, వాటర్ బాటిల్, కోడుగుడ్డు, చెక్లి అందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ మహావీర్, బహాద్దూర్ పాల్గొన్నారు.

# కోడుమూరు నియోజకవర్గ లబ్ధిదారులకు రూ.13.41 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

గూడూరు న్యూస్ : కోడుమూరు, సెప్టెంబర్ 27: కోడుమూరు నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు మొత్తం రూ.13,41,529/- (అక్షరాల పదమూడు లక్షల నలభై ఒకటి వేల ఐదు వందల ఇరభై తొమ్మిది రూపాయలు) విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కోడుమూరు ఎమ్మెల్యే శ్రీ బొగ్గుల దస్తగిరి గారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, డి.విష్ణువర్ధన్ రెడ్డి గారికి, ఎమ్మెల్యే శ్రీ బొగ్గుల దస్తగిరి గారికి ధన్యవాదాలు తెలిపారు.

లబ్ధిదారుల వివరాలు:

గంటా ఈడిగ ధనుంజయ గౌడ్ (గొల్లలదొడ్డి) -- ?32,527/-, మురుగేష్ శివలింగం (విష్ణు టౌన్షిప్) -- ?72,254/-,

కె సంధ్య (సూదిరెడ్డి పల్లె) -- ?18,163/-, మాస్టిక్ మణి (మామిదాలపాడు) -- ?68,011/-,

తెలుగు చెన్నయ్య (ఈ తాండ్రపాడు) -- ?50,524/-, పూల సుశీలమ్మ (బి తాండ్రపాడు) -- ?25,000/-,

బెక్కం రుచిత (రుద్రవరం) -- ?70,500/-, షేక్ మహ్మద్ రఫీ (గార్గేయపురం) -- ?1,43,502/-,

మండ్ల చిన్న మాదన్న (గోరంట్ల) -- ?40,900/-, అట్ల లక్ష్మి రెడ్డి (పోలకల్) -- ?1,72,120/-,

తెలుగు వీరేష్ (గుండ్రేవుల) -- ?73,988/-, చాకలి విక్రమ్ (గుండ్రేవుల) -- ?51,922/-,

కుమారి (పంచాలింగాల) -- ?2,24,078/-, మాదన్న (వర్కూర్) -- ?47,655/-,

మీనుగ వీరేష్ (వెంకాయ పల్లె) -- ?1,36,586/-, డి రఘు (ఉల్చాల) -- ?1,13,799/-

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

## కడపలో ఘనంగా హైకోర్టు న్యాయమూర్తుల కాన్ఫరెన్స్, వర్క్‌షాప్



కడప, మహిన్యూస్ సెప్టెంబర్ 27: 26.09.2026న కడప జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో హైకోర్టు గౌరవ న్యాయమూర్తులతో కాన్ఫరెన్స్ మరియు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి మరియు కడప జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ తార్లాడ రాజశేఖర్‌రావు చైర్‌పర్సన్‌గా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలాజీ మెడమల్లి గారు గౌరవ అతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ గోపాల్ వారికి సాదర స్వాగతం పలికారు. ఈ వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్లుగా విశ్రాంత జిల్లా న్యాయమూర్తులు బి. సత్యనారాయణ గారు మరియు జి. అన్వర్ బాషా పాల్గొన్నారు. కడప జిల్లాలోని అన్ని న్యాయస్థానాలకు చెందిన న్యాయాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేసుల నిర్వహణ, సత్వర పరిష్కారంపై హైకోర్టు న్యాయమూర్తులు పలు సూచనలు, మార్గదర్శకాలు అందించారు. అనంతరం 27.09.2026న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తార్లాడ రాజశేఖర్‌రావు, జస్టిస్ బాలాజీ మెడమల్లి మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ గోపాల్ కలిసి దేవుని కడపలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారిని, ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారిని మరియు నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.







## కడప విమానాశ్రయంలో కేంద్ర మంత్రికి వీడ్కోలు

### జిల్లా పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణం



కడప, సెప్టెంబర్ 27, మహి న్యూస్: కడప జిల్లా పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును కడప విమానాశ్రయంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కలిసి జిల్లా పర్యటన వివరాలపై మాట్లాడిన భూపేష్ సుబ్బరామిరెడ్డి, అనంతరం ఆయనకు వీడ్కోలు పలికారు. కేంద్ర మంత్రి జిల్లా పర్యటనను విజయవంతంగా ముగించుకుని విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

## నేడు (28వ తేదీ) పీజీఆర్ఎస్ కార్యక్రమం..!

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 27: జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు డీఆర్వో మల్లికార్జునుడు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలతో హాజరై వినతిపత్రాలు సమర్పించాలని కోరారు. అలాగే గతంలో సమర్పించిన అర్జీల వివరాలు తెలుసుకోవడానికి 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని, పాత అర్జీలకు సంబంధించిన రసీదు ఉంటే వెంట తీసుకురావాలని సూచించారు.

## కడపలో హైకోర్టు న్యాయమూర్తుల సదస్సు

### కేసుల సత్వర పరిష్కారంపై న్యాయాధికారులకు కీలక సూచనలు



కడప, సెప్టెంబర్ 27, మహి న్యూస్: కడప జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో సెప్టెంబర్ 26న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులతో న్యాయాధికారుల సదస్సు, కార్యశాల ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, కడప జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ తార్లాడ రాజశేఖర్‌రావు అధ్యక్షత వహించగా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలాజీ మెడమల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్ వారికి స్వాగతం పలికారు. కార్యశాలలో వనరుల వ్యక్తులుగా విశ్రాంత జిల్లా న్యాయమూర్తులు బి. సత్యనారాయణ, జి. అన్వర్ బాషా పాల్గొన్నారు. కడప జిల్లాలోని వివిధ న్యాయస్థానాలకు చెందిన న్యాయాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసుల నిర్వహణ, విచారణ ప్రక్రియను సమర్థవంతంగా కొనసాగించడం, కేసులను సత్వరమే పరిష్కరించడం వంటి అంశాలపై హైకోర్టు న్యాయమూర్తులు న్యాయాధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు అందించారు.







### పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అనంతరం సెప్టెంబర్ 27న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తార్లాడ రాజశేఖర్‌రావు, జస్టిస్ బాలాజీ మెడమల్లి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామగోపాల్ కలిసి దేవుని కడపలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి, నందలూరులోని శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయాల విశిష్టతను తెలుసుకున్నారు.

## పీఆర్సీ కమిటీని వెంటనే ప్రకటించాలి : ఆపస్



రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 27: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కోర్ కమిటీ సమావేశం రాయచోటిలోని ఆపస్ కార్యాలయం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు పరశురాం, సీనియర్ నాయకులు నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా ఇవ్వాల్సిన నూతన పిఆర్సి కమిటీని వెంటనే ప్రకటించి మధ్యంతర భృతిని ఇవ్వాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు నరసింహులు, జిల్లా సహాధ్యక్షులు పచార్ల సుధాకర్, నాగేంద్రబాబు మాట్లాడుతూ యాప్ల యొక్క భారంతో ఉపాధ్యాయులు బోధన మీద సరిగా దృష్టి సారించలేకపోతున్నారన్నారు. యాప్ ల భారాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా ఇన్చార్జ్ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి బాలాజీ, ఓబుల్ రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమను ప్రపంచ ఉద్యాన కేంద్రంగా తీర్చిదిద్దే బృహత్తర ప్రాజెక్ట్

### రీల్-వీడియో పోటీకి యువత, విద్యార్థులు, డిజిటల్ సృష్టికర్తలకు అవకాశం

కడప, సెప్టెంబర్ 27, (మహి న్యూస్): రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను ప్రపంచస్థాయి ఉద్యానవన కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న బృహత్తర ప్రాజెక్టును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు రీల్--వీడియో పోటీ నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. రాయలసీమ అభివృద్ధి, సాగునీటి వసతులు, తోటల విస్తరణ, రైతుల సాధికారతను ప్రతిబింబించేలా యువత, విద్యార్థులు, సామాజిక మాధ్యమాల సృష్టికర్తలు, డిజిటల్ సృష్టికర్తలు తమ సృజనాత్మకతను చాటుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

### 60-90 సెకన్ల వీడియోలు

పోటీలో పాల్గొనేవారు 60 నుంచి 90 సెకన్ల నిడివి గల వీడియోలను సెప్టెంబర్ 27 నుంచి సెప్టెంబర్ 30 మధ్యాహ్నం 12 గంటల వరకు సమర్పించాలి. అందిన వీడియోల్లో ఉత్తమ ఐదు వీడియోలను సెప్టెంబర్ 30 సాయంత్రం ఎంపిక చేసి, అక్టోబర్ 1న విజేతలను ప్రకటించనున్నారు. ఎంపికైన ఐదుగురు విజేతలను సుమారు 50 వేల మంది పాల్గొనే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి చేతుల మీదుగా సన్మానించడంతో పాటు, వారి వీడియోలను కార్యక్రమ వేదికపై ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.



### సామాజిక మాధ్యమాల్లో ప్రచారం

పోటీదారులు తమ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచురించే సమయంలో ఆంధ్రప్రదేశ్ డిజిటల్ కార్పొరేషన్ అధికారిక ఖాతా ను తప్పనిసరిగా గుర్తించాలని సూచించారు.

### రూ.లక్ష కోట్లతో ఉద్యానవన అభివృద్ధి

తక్కువ వర్షపాతం, కరువు పరిస్థితులతో ఉన్న రాయలసీమను ఉద్యానవన సాగుకు అనుకూలమైన ప్రాంతంగా అభివృద్ధి చేయడమే ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని కలెక్టర్ వివరించారు. సుమారు రూ.1 లక్ష కోట్ల అంచనా వ్యయంతో, 2026 నుంచి 2029 వరకు మూడు దశల్లో 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లలో సమగ్ర ఉద్యానవన అభివృద్ధి ప్రణాళిక అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 6 లక్షల హెక్టార్లలో కొత్తగా తోటల విస్తరణ, 9.6 లక్షల రైతు కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజనం, 49.3 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సుమారు రూ.81 వేల కోట్ల అదనపు ఆర్థిక ప్రయోజనం సమకూరే అవకాశం ఉందన్నారు. మామిడి, అరటి, టమోటా, దానిమ్మ, ఖర్జూరం, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటల ఉత్పత్తి, ఎగుమతులు, ఆహార శుద్ధి పరిశ్రమల అభివృద్ధి ద్వారా రాయలసీమను దేశంలోనే ప్రముఖ పండ్ల ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రాజెక్టు కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత, విద్యార్థులు, డిజిటల్ సృష్టికర్తలు సద్వినియోగం చేసుకుని తమ సృజనాత్మకతతో పోటీలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

### - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 27: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ. ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు. అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## గండికోటలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ స్వచ్ఛతా కార్యక్రమం..!

### పర్యాటక ప్రాంతాల పరిశుభ్రత, పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన




కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ సెప్టెంబర్ 27: ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026 వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు వైఎస్ఆర్ కడప జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో ఆదివారం ప్రత్యేక స్వచ్ఛతా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అథారిటీ, వైఎస్ఆర్ కడప జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పర్యాటక శాఖ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని గండికోట కోట పరిసరాలను శుభ్రం చేశారు.ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా "Digital Agenda and Artificial Intelligence to Redesign Tourism" అనే ఇతివృత్తాన్ని నిర్దేశించిన నేపథ్యంలో, పర్యాటక రంగంలో సాంకేతికతతో పాటు పర్యాటక ప్రదేశాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వారసత్వ సంపద సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. జమ్మలమడుగు బీసీ సంక్షేమ బాలుర వసతి గృహానికి చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గండికోట కోట పరిసరాలు, పర్యాటకులు సందర్శించే ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా, పర్యాటక ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు విద్యార్థులకు సూచించారు. పర్యాటక ప్రాంతాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించగలదని వివరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గండికోట కేవలం ఒక చారిత్రక కోట మాత్రమే కాకుండా, గొప్ప వారసత్వ సంపదతో పాటు పెన్నా నది లోయ అందాలను కలగలిపిన విశిష్ట పర్యాటక ప్రాంతమని తెలిపారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించే ప్రతి ఒక్కరూ అక్కడి పరిశుభ్రతను కాపాడాలని, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని అధికారులు సూచించారు. చారిత్రక కట్టడాల గోడలు, నిర్మాణాలను దెబ్బతీయకుండా వాటి వారసత్వ విలువను కాపాడుకోవాలని, భవిష్యత్ తరాలకు ఈ చారిత్రక సంపదను సురక్షితంగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. స్వచ్ఛతా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను అధికారులు అభినందించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు ఆహార ఏర్పాట్లు చేసి అందించారు. స్వచ్ఛతా కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ స్వచ్ఛతా కార్యక్రమం ద్వారా "పర్యాటక ప్రదేశం మనదే.. దాని పరిశుభ్రత, పరిరక్షణ మనందరి బాధ్యత" అనే సందేశాన్ని ప్రజలకు చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌టీడీసీ డివిజన్ మేనేజర్ మల్లికార్జున గౌడ్, జిల్లా పర్యాటక శాఖ కార్యాలయ మేనేజర్ రామ్ కుమార్, పర్యాటక శాఖ సిబ్బంది, బీసీ సంక్షేమ బాలుర వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పర్యాటక రంగ అభివృద్ధితో యువతకు ఉపాధి, ఆదాయ అవకాశాలు

### జిల్లా రెవెన్యూ అధికారి ఏ. వెంకటేష్

### మదనపల్లి కలెక్టరేట్లో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల నిర్వహణ

మదనపల్లె, మహి న్యూస్ సెప్టెంబరు 27: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఏ. వెంకటేష్, జిల్లా పర్యాటక అధికారి, ఇతర అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటకం కేవలం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణించడం మాత్రమే కాకుండా, ఆయా ప్రాంతాల సామాజిక, సాంస్కృతిక, చారిత్రక విశిష్టతలను తెలుసుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. పర్యాటక రంగం ద్వారా యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఆదాయ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కొత్త ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లాలో ఆధ్యాత్మిక, వారసత్వ, పర్యావరణ పర్యాటకానికి అనువైన అనేక ప్రాంతాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసి మరింత మంది పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పర్యాటక రంగంలో డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు వినియోగానికి ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. జిల్లాలో ప్రపంచ పర్యాటక వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థుల్లో పర్యాటక రంగంపై అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో విద్యార్థులతో ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు, గుర్రంకొండ కోటలో హెరిటేజ్ వాక్‌ను నిర్వహించారు. విశ్వం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారని వివరించారు. జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణ కిషోర్ మాట్లాడుతూ.. పర్యాటక రంగం సేవా రంగంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా ఎంఎస్ఎంఈలు, చిన్న వ్యాపారాలు, హోటళ్లు, ట్రావెల్ సంస్థలు అభివృద్ధి చెంది యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పర్యాటక ప్రాంతాలను సందర్శించడం ద్వారా ఆయా ప్రాంతాల చరిత్ర, కళలు, శిల్పకళ, సంస్కృతి గురించి తెలుసుకోవడంతో పాటు మానసిక ఉల్లాసం, ఆరోగ్యానికి కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. SGSW అధికారి అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో పని ఒత్తిడి కారణంగా ప్రజల్లో మానసిక ఒత్తిడి పెరుగుతోందని, పర్యాటకం ద్వారా మానసిక ప్రశాంతత, ఉల్లాసం పొందవచ్చన్నారు. అలాగే 'పర్యాటక రంగంలో డిజిటల్ టెక్నాలజీ మరియు కృత్రిమ మేధస్సు ప్రాధాన్యత' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు, కళాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హోటలియర్స్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, ట్రావెల్ ఏజెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, హోటల్ నిర్వాహకులు, ట్రావెల్ ఏజెంట్లు, సాంస్కృతిక కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.






EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com